T.T.D. Religious Publications Series No.909
Price :

## శంకరాభరణం

శ్రీహరి పాదతీర్థంబే చెడని మందు
మోహపాశాలు గోసి మోక్షమిచ్చే మందు ॥పల్లవి॥

కారమై గంటగించని కడుఁజల్లని మందు
నూఱని కాచని యట్టి నున్నని మందు
కోరికతో వెలవెట్టి కొని తేవల్లనిమందు
వేరు వెల్లంకులు కూర్చనట్టి వెందువోని మందు ॥పల్లవి॥

గుఱుతైన రోగములు గుణము చేసే మందు
దురితములు పెడఁబాపే దొడ్డమందు
నిరతము బ్రహ్మాదులు నేరుపుతో సేవించే మందు
నరకము సొరనట్టి నయమయిన మందు ॥శ్రీహరి॥

పొంకముతో భయములు పొందనియ్యని మందు
మంకుబుద్ధులు మాన్పి మన్నించే మందు
పంక్షజాక్ష వేంకటరమణ ప్రపన్నుని మందు
సెంకించక తన దాసులఁ జేపట్టే మందు ॥శ్రీహరి॥

– తాళ్లపాక అన్నమాచార్యులు

Published by **Sri M.G. Gopal,** I.A.S., Executive Officer,
T.T.Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

"తిరుమల క్షేత్రదర్శిని" గ్రంథమాల

# శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

## (ఉత్సవాల దేవుడు వేంకటేశ్వరుడు)

– జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

“తిరుమల క్షేత్రదర్శిని” గ్రంథమాల

# శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

## (ఉత్సవాల దేవుడు వేంకటేశ్వరుడు)

రచన

**జూలకంటి బాలసుబ్రహ్మణ్యం**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2014**

**SRI VENAKTESWARA SWAMY UTSAVALU**
**(UTSAVALA DEVUDU VENKATESWARUDU)**

**By**
**Julakanti Balasubrahmanyam**

T.T.D. Religious Publications Series No. 909
© All Rights Reserved

*First Edition : 2012*
*Re-print : 2014*

Copies : 3000
Price :

*Published by :*
**M.G. GOPAL**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

***D.T.P:***
Office of the Editor in Chief,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

**“వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన**
**వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి”**

వేంకటాద్రికి సమానమైన మరో క్షేత్రం ఈ బ్రహ్మాండంలోనే లేదు. వేంకటేశ్వరునికి సాటి రాగల దేవుడు ఇంతవరకు ఎక్కడా లేదు. ఇక మీదకూడ ఉండదు – అని అర్థం.

కలియుగవైకుంఠంగా భాసిల్లే శ్రీవేంకటాద్రిపై అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామి అవతరించి నిత్యమూ భక్తులకు దర్శనమిస్తూ వారిని తరింపజేస్తున్నాడు. శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళ విగ్రహమూర్తిని ఒక్క క్షణకాలమైనా దర్శించుకొని తరించడానికి వేలకొద్దిమంది భక్తులు నిత్యమూ ఈ క్షేత్రానికి యాత్ర చేస్తుంటారు.

పిలిస్తే పలికే ప్రత్యక్షదైవమూ, కోరిన వరాలరాయుడూ ఐన శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన ఈ క్షేత్రంలోని స్వామి దివ్యమంగళ విగ్రహం, స్వామి పుష్కరిణి, పవిత్రతీర్థాలు, స్వామికి అతివైభవంగా జరిగే నిత్యకైంకర్యాలు, స్వామి బ్రహ్మోత్సవాలు మొదలైన విశేషాలు భక్తులకు తెలియజేయాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం **‘తిరుమల క్షేత్రదర్శిని’** అనే పేర ఒక గ్రంథమాలను ప్రారంభించి, ఆ యా పండితులచేత గ్రంథాలను రాయించి ప్రకటించాలని తలపెట్టింది.

ఈ గ్రంథాలలో, ప్రస్తుతం శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యంగారు రచించిన **'శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు' (ఉత్సవాల దేవుడు వేంకటేశ్వరుడు)** అన్న ఈ గ్రంథాన్ని భక్తులకు అందజేస్తున్నాము. భక్తు లీ గ్రంథంద్వారా శ్రీ స్వామివారి విశేషాలతోపాటు శ్రీవారి ఉత్సవాలవివరాలను కూడ తెలుసుకొని ధన్యత నొందుదురుగాక అని ఆకాంక్షిస్తున్నాము.

సదా శ్రీవారి సేవలో....

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# విషయసూచిక


| | |
|---|---|
| ముందుమాట | iii |
| శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు | 1 |
| అద్భుతమైంది ఈ కొండ | 4 |
| వింత వింత నామాలు (పేర్లు) | 4 |
| ఏడు కొండలు | 5 |
| శేషాచలం | 5 |
| వేంకటాచలం | 6 |
| నారాయణాచలం | 7 |
| గరుడాచలం | 8 |
| వృషాచలం | 9 |
| వృషభాచలం | 9 |
| అంజనాచలం | 11 |
| విచిత్ర భంగిమ! | 19 |
| అబ్బురపరిచే ఆభరణాలు | 20 |
| కమ్మని ఆరగింపులు | 23 |
| వింత వింత మొక్కుబడులు | 26 |
| ఆనందకరమైన లీలలు | 29 |

| | |
|---|---|
| **పంచబేరాలు** | **33** |
| **సందడిగా సాగే ఉత్సవాలు** | **38** |
| **నిత్యోత్సవాలు** | **38** |
| **వారోత్సవాలు** | **45** |
| **పక్షోత్సవాలు** | **50** |
| **మాసోత్సవాలు** | **50** |
| **సంవత్సరోత్సవాలు** | **52** |
| **సమర్పణం** | **68** |


# శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

## (ఉత్సవాల దేవుడు వేంకటేశ్వరుడు)

**శేషాచలే యన్మాహాత్మ్య మన్యక్షేత్రే న తత్ క్వచిత్**
**తద్గతశ్రీనివాసస్య మహిమా నాన్యగః శుభః**

శేషాచలక్షేత్రం ప్రపంచ ప్రసిద్ధి పొందిన పుణ్యస్థలం! ఈ దివ్యక్షేత్రానికి ఉన్న మహిమ ఇతర క్షేత్రాలకు దేనికీ లేనే లేదు. అలాగే పరమపావనమైన ఈ దివ్యస్థలంలో కొలువైవున్న శ్రీవేంకటేశ్వరుడి  వంటి గొప్ప మహిమాన్వితమైన దేవుడు ఇంకెక్కడా కానరాదు. అందువల్లే ఆ స్వామిని "యోஉసి సోஉసి" అనగా "ఎవడివై వున్నావో వాడివే నీవు" అని వేదం కీర్తిస్తోంది. అనగా నీకు నీవే సాటి అని అన్నియుగాల్లో అన్ని కాలాల్లో అన్నిస్థలాల్లో స్తుతింపబడుతున్న స్వామి  శ్రీనివాసుడు!

ఇంతటి అద్భుతమైన దేవుడు ఎక్కడినుంచి వచ్చాడు? ఎందుకు వచ్చాడు? ఎప్పుడు వచ్చాడు? ఆ స్వామి నిలిచివున్న కొండ ఎలాంటి క్షేత్రం? స్వామిమాదిరే ఆ కొండకు ఏమైనా ప్రత్యేకతలు వున్నాయా? మహిమలు వున్నాయా? వుంటే అవి ఎన్నో! ఏవో! ఎలాంటివో! ఎవరికెరుక! తెలిస్తే తిరుమలేశునికే తెలియాలి! తిరుమలేశునికి మాత్రమే తెలియాలి! తిరుమలేశుడు ఒక్కనికి మాత్రమే తెలియాలి. అంతే! అంతే!!

**వైకుంఠం వా పరిత్యక్ష్యే న భక్తాంస్త్యక్తుముత్సహే**
**మేஉతిప్రియా హి మద్భక్తా ఇతి సంకల్పవానసి ॥**

నేను శ్రీ వైకుంఠాన్నయినా విడిచివుంటాను గాని, నా భక్తులను ఒక్క క్షణమైనా విడిచివుండలేను - అన్న దృఢమైనసంకల్పంతో సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు శ్రీ వైకుంఠం నుండి భువికి దిగి వచ్చాడు. ఈ భువిలో ఈ వేంకటాచలక్షేత్రంలో "శ్రీ వేంకటేశ్వరుడు" అన్న పేరుతో వక్షఃస్థల

లక్ష్మీసమేతంగా అద్భుతమైన సాలగ్రామశిలామూర్తిగా స్వయంవ్యక్తరూపంతో కొలువై భక్తులకు దివ్యదర్శనాన్ని అనుగ్రహిస్తున్నాడు.

“కలౌ వేంకటనాయకః” అన్న ప్రసిద్ధితో ఈ కలియుగంలో అందరికీ ఏకైక దిక్కును నేనే! నేనేనంటూ తిరుమల కొండపై వెలసివున్న దేవుణ్ణి, దర్శించి తరించడంకోసం అహరహం భక్తులు తిరుమల క్షేత్రానికి యాత్ర చేస్తూనే వున్నారు.

నిరంతరం నిరంతరాయంగా ఇందరిని ఇంతగా ఆకర్షించి భక్తులను రప్పించుకొంటున్న తిరుమలకొండ విచిత్రపు కొండ! అద్భుతమైన కొండ! ఎన్నో మహిమలను, మరెన్నో లీలలను పుణికిపుచ్చుకొన్న కొండ! ఈ కొండలోని రాళ్లూ, రప్పలూ గండశిలలు, గుట్టలు నిజంగా అవి కానే కావు. అలా కన్పిస్తాయి. అంతే! అవన్నీ అనంతమహిమలు కలిగివున్న చింతామణులు! రత్నాలరాసులు! భగవంతునికి ప్రతీకలైన సాలగ్రామ శిలలు! ఒకటా! రెండా! ఈ కొండంతటా ఎక్కడ చూచినా సాలగ్రామమయమే! కాదు కాదు. అసలు కొండే సాలగ్రామం! అంత మాత్రమేనా! ఇంకా ఆ కొండమీద వెలసివున్న శ్రీనివాసభగవానుడు సాక్షాత్తు సాలగ్రామశిలావిగ్రహరూపంలో స్వయంవ్యక్తంగా ఆవిర్భవించాడని పురాణాలు స్పష్టంగా చెపుతున్నాయి.

అందువల్లే శ్రీనివాసుని నందక ఖడ్గం అంశంతో అవతరించిన తాళ్లపాక అన్నమయ్య చెప్పులు లేకుండా వట్టి కాళ్లతో తిరుమల కొండను ఎక్కాడు. అంతకంటె చాలకాలం ముందే భగవద్రామానుజాచార్యులవారు సాలగ్రామ మయమైన ఈ తిరుమలకొండనే, సాక్షాత్తు దేవుడని భావించి మోకాళ్లతో కొండనెక్కాడు. ఆ తర్వాత మధ్వ సంప్రదాయ ప్రవర్ధకులైన వ్యాసరాయలవారు కూడ మోకాళ్లతోనే తిరుమలకు నడచి వెళ్లారని చరిత్ర ప్రసిద్ధి!



భూలోక వైకుంఠం అయిన ఈ తిరుమలకొండకు మహిమలు ఇన్నిన్నీ అని చెప్పడం సాధ్యం కానే కాదు. ఈ కొండను ఎక్కితే చాలు. ఎన్నో ఎన్నెన్నో దోషాలు పోతాయి. తాకితే చాలు. మరెన్నెన్నో తెలియక చేసిన ఘోర పాపాలు నశిస్తాయి. మరి ఈ కొండమీద వీచే చల్లని గాలులు సోకితే చాలు. అనేకమైన శారీర రుగ్మతలు, భయంకరమైన కర్మరోగాలు సులువుగా పోతాయి.

ఇక ఈ కొండమీద జలజలా పారే సెలయేళ్లు కొండలమీదినుంచి దుమికే జలపాతాలు, పుష్కరిణులు అందులోని పావన జలాల మహిమలు ఇంతింతని వర్ణించడానికి ఎవరికీ సాధ్యం కాదు.

ఒకప్పుడు బ్రహ్మాది దేవతలు, కుమారస్వామి, అంజనాదేవి, శ్రీరామచంద్రుడు, లక్ష్మణుడు, సప్తర్షులు, తుంబురుడు, నారదుడు, పాండవులు, ఆళ్వారులు, తాళ్లపాక అన్నమాచార్యులు, కన్నడ హరిదాసులు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ఇలా ఎందరెందరో మహనీయులు, పరమయోగులు, మునులు, పరమభక్తులు ఆ యా యుగాల్లో, ఆ యా కాలాల్లో ఈ వేంటాచల పర్వత సానువుల్లో తిరుగాడినారు. వారి వారికి నచ్చిన తీరుల్లో, వారు మెచ్చిన రీతుల్లో తపస్సులు చేశారు. పవిత్ర స్నానాలు చేశారు. కొండలరాయణ్ణి కీర్తించారు. గానం చేశారు. యాగాలు చేశారు. యజ్ఞాలు నిర్వహించారు. ఇలా ఎన్నెన్నో విధాలుగా సాధనలు చేస్తూ పునీతులయ్యారు. తరించారు. తాము తరించడమేగాక ఎందరినో తరింపజేశారు, తరింపజేస్తూనే వున్నారు. వేంకటాచల క్షేత్రానికి వున్న అనంత మహిమలను ఆ మహనీయులు ఎన్నో విధాలుగా వర్ణించారు.

మరి ఇంతటి మహిమోపేతమైన ప్రశస్తికి ఆ క్షేత్రవైభవం, శ్రీస్వామివారి నామవైభవం, దివ్యమంగళ విగ్రహమూర్తి వైభవం, అర్చనావైభవం, ఉత్సవ వైభవం... ఇలా ఎన్నెన్నో ఉదాహరణలు!

## అద్భుతమైంది ఈ కొండ

వేంకటాచలం క్షేత్రం అద్భుతమైనది కొండ! ఆశ్చర్యకరమైన కొండ! ఆ క్షేత్రం ఎలాంటిదో మనకు ప్రత్యక్షంగా అన్నమయ్య దర్శింపజేస్తున్నాడు చూడండి.

**కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ!**
**తెట్టెలాయ మహిమలే తిరుమల కొండ!**

**వేదములే శిలలై వెలసిన దీ కొండ!**
**యే దెస పుణ్యరాసులే ఏరులైనదీ కొండ!**
**గాదిలి బ్రహ్మాదిలోకముల కొనల కొండ!**
**శ్రీదేవుడుండేటి శేషాద్రి యీ కొండ!!**

అన్నమాచార్యుల కుమారుడు పెదతిరుమలయ్య కూడ

**కొండా! చూతము రారో! కొండొక తిరుమల కొండా!**
**కొండని యడిగిన వరములొసగు మా కొండల తిమ్మయకొండా!**

**ఇదియె క్షీరాంబుధి యనుచు మరి యిదియె ద్వారక యనుచు**
**ఇదియె నందవ్రజ మనుచును మరి యిది దా నయోధ్య యనుచూ**
**ఇదియె వైకుంఠం బనుచును యిది పరతత్త్వంబనుచు**
**యిదియె పరమపదం బనుచు వేదముల యెన్నగగల మా కొండా!**

అంటూ ఈ క్షేత్ర దివ్య మహత్త్వవైభవాన్ని వర్ణించిన తీరు అద్భుతం! పరమాద్భుతం.

## వింత వింతనామాలు (పేర్లు)

శ్రీ వేంకటేశ్వరస్వామికి ఎన్నో పేర్లు! ఎన్నెన్నో పేర్లు! అవన్నీ నిజంగా ఆ స్వామివారి అసలైన పేర్లేనా? అంటే అదీ చెప్పలేం. కాని ఒక్కటి మాత్రం నిజం! భక్తులు ప్రియాతిప్రియంగా, ఎంతో ఇష్టంగా తమకునచ్చిన పేర్లతో ఆ



స్వామిని పిలుచుకుంటున్నారు. అయితే స్వామి తనను ఆ భక్తులు ఎలా పిలిస్తే అలానే పలుకుతున్నాడు. ఆ పేర్లన్నీ విచిత్రంగాను వున్నాయి. అద్భుతంగాను వున్నాయి. ఆశ్చర్యంతోపాటు ఆనందాన్ని కలిగించేవిగాను వున్నాయి.

కొందరు భక్తులు ఆ స్వామివారిని "ఏడుకొండలవాడా!" అని ఆర్తిగా ఎలుగెత్తి పిలుస్తారు. శేషాచలం, వేంకటాచలం, నారాయణాచలం, గరుడాచలం, వృషాచలం, వృషభాచలం, అంజనాచలం – ఏడుకొండలలో వున్నందువల్ల ఏడుకొండలవాడని పిలువబడుతున్నాడు. ఇలా ఏడుకొండలవాడా! అని పిలువగానే, స్వామివారు ఏడుకొండలు నావే కదా! నేనే అధిపతిని కదా! అని ఉబ్బిపోయి ఉబ్బితబ్బిబ్బై ఆనందంతో భక్తులకు కోరికలు తీరుస్తున్నాడు. ఈ ఏడుకొండల పేర్లు ఎలా ఏర్పడ్డాయో, ఏయే భక్తుల పేర్లతో ఏర్పడ్డాయో తెలుసుకుందాం.

## ఏడుకొండలు

ఆ ఏడుకొండలు ఎక్కడ వున్నాయి. వాటి పేర్లు ఏవి? అవి ఎలా ఏర్పడ్డాయి? అంటే?

ఆ ఏడుకొండలు ఎక్కడో లేవు. ఇదిగో ఈ తిరుమల పర్వత సానువుల్లో చోటు చేసుకున్న పర్వత శిఖరాలే ఏడుకొండలు. శేషాచలం, వేంకటాచలం నారాయణాచలం, గరుడాచలం, వృషాచలం, వృషభాచలం, అంజనాచలం – ఇవే ఈ ఏడుకొండల పేర్లు. బాగుంది. వాటికి ఆ పేర్లు ఎలా కలిగాయి. అంటే?

### శేషాచలం

పూర్వం ఒకప్పుడు వేయిపడగల ఆదిశేషునికి, వాయుదేవునికి మాటామంతీ పెరిగింది. ఆ మాటలు పెరిగి పెరిగి చివరకూ ఇద్దరూ "నేను గొప్పంటే నేను గొప్ప" అనీ, కాదు కాదు నీకంటే నేనే గొప్ప అని వాదులాడుకున్నారు. ఇంకేమి?

కోపంతో చిర్రెత్తి ఆదిశేషుడు ఇలా అన్నాడు. నీవు నాకంటె గొప్పవాడివి అయితే నన్ను కొంచెం కదల్చు. అంటూ ఆదిశేషుడు శ్రీ వైకుంఠంలోని శ్రీవారి క్రీడాచలాన్ని చుట్టుకున్నాడు. అంతే! వాయుదేవుడు తన బలాన్నంతా సమకూర్చుకొని ఉన్నపళంగా ఒక్కసారి, ఆ కొండను, ఆ కొండకు చుట్టుకొన్న ఆదిశేషుణ్ణి ఉఫ్! అంటూ ఊదాడు. ఇంకేముంది, ఇదిగో! ఇలా ఆ పర్వతంతోకూడా ఆదిశేషుడు ఈ భూలోకంలో ఎగిరివచ్చి పడ్డాడు. తనకు జరిగిన అవమాన భారంతో ఆదిశేషుడు క్రుంగిపోయాడు. శ్రీమన్నారాయణుడైన శ్రీనివాసుడు ఆదిశేషుణ్ణి ప్రేమగా స్పృశించి భావిస్తూ శేషుడా! నీవు ఏమాత్రం బాధపడవద్దు. నేను నిన్ను నా బాహువులకు ఆభరణంగా ధరించి నాగాభరణునిగా దర్శనమిస్తాను. అంతేకాదు. ఈనాటినుండి ఈ పర్వతం నీ పేరుతో శేషాచలంగా ప్రసిద్ధి చెందుతుంది.

నేను గూడ "శేషాచలపతి" అనే పేరుతోనే భక్తులతో పిలిపించుకుంటాను అంటూ అనునయించాడు. ఆదిశేషుడు తృప్తి పొందాడు. ఇదిగో ఆ నాటినుంచి ఇది 'శేషాచలం'గా 'శేషాద్రి' గా పిలువబడుతున్నది. ఇదే మొదటి కొండ!

## వేంకటాచలం

రెండవకొండ వేంకటాచలం! వేం అనగా పాపాలను అన్నింటిని కటః దహించేది – అనగా పాపరాశిని భస్మం చేస్తుందట! ఎలా అంటే భయంకరమైన దావాగ్నిలో ఒక పిడచంత దూది పడితే దాని దరికి పోకుండానే ఆ వేడికి కాలి బూడిద అయి ఎగిరిపోయినట్లుగా వేంకటాచల పర్వతాన్ని తాకితే చాలు. పాపాలు అన్నీ ఇట్టె నశిస్తాయట! అందువల్లే వేంకటః. ఇదే వేంకటాచలం! అంతేకాదు

**'వేంకారోఽమృతబీజస్తు కటమైశ్వర్య ముచ్యతే**
**అమృతైశ్వర్యసంఘత్వాత్ వేంకటాద్రిరితి స్మృతః'**



అంటూ వేంకటాచల పురాణంలో చెప్పబడింది. అనగా వేం = అనగా అమృతత్వాన్ని, కటః = ఐశ్వర్యాన్ని ఇలా రెంటినీ అనగా లౌకికమైన సంపదలతోపాటు పారలౌకికమైన మోక్షాన్ని ప్రసాదిస్తుందట ఆ కొండ! అందుచేత ఇది వేంకటపుకొండ! అని పేరు పొందింది.

## నారాయణాచలం

మూడవకొండే నారాయణాచలం! అదే నారాయణాద్రి!

పూర్వం నారాయణుడు అనే భక్తుడు దేశసంచారం చేస్తూ చివరకు వేంకటాచల క్షేత్రానికి చేరుకొన్నాడు. ఆ కొండల్లో కోనల్లో విహరిస్తూ అక్కడి ప్రకృతి సౌందర్యానికి ఆకర్షితుడయ్యాడు. అక్కడ జలజలారాలే జలపాతాల్ని చూసి ఆనందపడ్డాడు. అక్కడ ప్రవహించే సెలయేళ్లలో స్నానం చేస్తూ పులకించిపోయాడు.

ఇంకా ఆ కొండపై నెలకొన్న కోనేటిలో స్నానం చేసేవాడు. ముఖ్యంగా 'స్వామిపుష్కరిణీ' తీర్థ పావన జలాల్లో స్నానం చేస్తూ ఆనందనిలయంలోని వేంకటాచలపతిని, ఆ స్వామివారి వక్షఃస్థలంలో కొలువైవున్న 'వ్యూహలక్ష్మి' అనబడే మహాలక్ష్మిని తీవ్రంగా ఉపాసించినాడు. కొంతకాలానికి ఆ శ్రీనివాసుడు ప్రత్యక్షమై అడగగా నారాయణుడు "స్వామీ! వేంకటపతీ! ఈ కొండ నా పేరుతో అనగా 'నారాయణాద్రి' గా ప్రశస్తిని పొందాలి. అంతేకాదు ఈ కొండపై నీవు ప్రత్యక్షంగా భక్తులకు దర్శనమిచ్చి రక్షించు!" ఇదే నా కోరిక స్వామీ! అంటూ ప్రార్థించినాడు. వెంటనే వేంకటేశ్వరస్వామి తథాస్తు! అంటూ ఆ నారాయణునికి మోక్షాన్ని ప్రసాదించినాడు. ఆనాటినుండి ఈ కొండ "నారాయణాద్రి"గా పిలువబడుతున్నది.

## గరుడాచలం

ఏడుకొండలలో గరుడాచలం నాల్గవది! అదే గరుడాద్రి!

శ్రీ మహావిష్ణువు "పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం సంభవామి యుగేయుగే" అన్నట్లుగా యుగయుగాల్లో అవతరించి దుష్టుల్ని సంహరించి, సాధువులను రక్షిస్తుంటాడు.

ఒకప్పుడు హిరణ్యాక్షుడనే రాక్షసుడు లోకాల్ని అనేక విధాలుగా హింసించాడు. పరమ సాధువుల్ని బాధపెట్టాడు. ఈ రక్కసుని బాధలు పడలేక ఓర్చుకోలేక వాళ్లంతా శ్రీహరిని రక్షించవలసిందని వేడుకొన్నారు.

హిరణ్యాక్షుడు అంతటితో వూరుకుంటేనా! అంతటితో ఆగక ఏకంగా భూమండలాన్ని చుట్టగా మడతబెట్టి పాతాళానికి తీసుకెళ్ళి దాన్ని కాళ్లతో తన్నుతూ క్రీడించినాడు. వెంటనే సాక్షాత్తు భూదేవి వైకుంఠపతిని వేడుకొంది. అంతే సాక్షాత్తు వైకుంఠవాసుడైన శ్రీమహావిష్ణువు భయంకరమైన వాడి కోరలతో శ్వేత వరాహస్వామిగా అవతరించి హిరణ్యాక్షుని సంహరించాడు. అదే కోరలతో భూమిని సంరక్షించి ఉద్ధరించాడు.

ఆ ఘనకార్యానికి బ్రహ్మాది దేవతలు, కిన్నర గంధర్వాదులు, మహర్షులు యోగులు ఎందరో హర్షిస్తూ ఆదివరాహస్వామిని అనేక విధాలుగా స్తుతించారు. కీర్తించారు. అంతేకాదు, భూదేవిని రక్షించిన ఆదివరాహరూపంతోనే ఇక్కడే దర్శనమిస్తూ లోకుల్ని కటాక్షించవలసిందని బ్రహ్మాది దేవతలు అనేక విధాలుగా ప్రార్థించారు.

వారి ప్రార్థన మేరకు ఆదివరాహస్వామి ఈ భూలోకంలో ఇదే రూపంలో నిలిచి వుంటానని వరమిస్తూ, ప్రక్కనేవున్న గరుత్మంతుని ఇలా ఆదేశించాడు. "గరుత్మంతా! నీవు శ్రీవైకుంఠానికి వెళ్లు. అక్కడ నేను శ్రీ మహాలక్ష్మితో విహరిస్తూ



క్రీడించిన క్రీడాద్రి పర్వతాన్ని, అక్కడవుండే క్రీడావాపి అనే సరస్సును ఇదిగో ఇక్కడ తెచ్చి స్థాపించుమని ఆదేశించినాడు.

వెంటనే గరుడ భగవానుడు "చిత్తం ప్రభూ" అంటూ రివ్వున రెక్కలు విదలుస్తూ శ్రీవైకుంఠానికి వెళ్లి, అక్కడ క్రీడావాపితో కూడిన క్రీడాద్రిని తెచ్చి ఇక్కడ ఈ భూలోకంలో స్థాపించాడు. అదే గరుడాద్రి! సాక్షాత్తు గరుత్మంతుడు తెచ్చి ప్రతిష్ఠించినందువల్ల దీనికి "గరుడాచలం" అంటూ ప్రసిద్ధి ఏర్పడింది.

## వృషాచలం

ఏడుకొండలలో ఐదవకొండ వృషాచలం. వృషం అనగా ధర్మం! ఒకప్పుడు ధర్మదేవత తిరుమలేశుని గూర్చి తీవ్రంగా తపస్సు చేసిందట! ఏమని? అంటే, తన ధర్మాన్ని తాను నిష్పక్షపాతంగా నిర్వహించేట్లుగాను, తద్వారా తన అభివృద్ధికోసం తపస్సు చెయ్యగా శ్రీనివాసుడు 'శుభం!' అంటూ అనుగ్రహించాడట. అలా ధర్మదేవత అనగా వృషాధిపతి తపస్సు చేసిన దివ్యస్థలం అయినందువల్ల వృషాచలం! అనే పేరు పొందింది. అదే వృషాద్రి!

## వృషభాచలం

ఆరవకొండ వృషభాచలం. వృషభాచలం అని పిలవడానికి ఒక అద్భుతమైన కథ వినపడుతోంది.

పూర్వం వృషభాసురుడు అనే రాక్షసుడు వుండేవాడు. వాడు పరమశివభక్తుడు, వాడు ఎంతటి శివభక్తుడో అంతటి దుష్టుడు, క్రూరుడు. భక్తుల కోరికపై వాణ్ణి సంహరించడానికి శ్రీహరి కిరాతవేషాన్ని ధరించాడు. అంతే ఇద్దరూ ఘోరంగా తలపడ్డారు. చివరకు శ్రీనివాసుడు వాడిపై సుదర్శన చక్రాయుధాన్ని ప్రయోగించాడు. ఆ సుదర్శనచక్ర మహా ఆయుధంతో తనకు చావు తప్పదని తెలుసుకున్న వృషభుడు శ్రీనివాసుని పాదపద్మాలమీద

సాష్టాంగపడుతూ శరణు వేడినాడు. స్వామీ! శ్రీనివాసా! నన్ను సంపూర్తిగా క్షమించు స్వామీ! నీ చేతిలోని సుదర్శన చక్రంతో వధింపబడడం నా పూర్వజన్మల సుకృతంగా భావిస్తున్నాను. చివరిగా నా కోరికను తప్పక తీర్చగల కొండలంతటి కరుణామూర్తివి. దయాంతరంగుడవు. స్వామీ! శ్రీనివాసా! ఇదిగో నేను తిరిగిన ఈ పర్వతప్రాంతం నా పేరుమీద వృషభాచలంగా పేరు పొందాలి. అలాగే ఈ కొండపై నీవు చిరస్థాయిగా నిలిచివుంటూ “వృషాభాద్రిపతి”గా పేరొంది భక్తులను సంరక్షించు అంటూ వేయి విధాలుగా ప్రార్థించాడు. శ్రీనివాస ప్రభువు తథాస్తు! అంటూ తన చక్రంతో వాణ్ణి సంహరించినాడు. అప్పటినుండి, ఆనాటినుండి ఇది వృషభాచలం అయ్యింది.

ఈ వృషభాచలం నామానికి సంబంధించిన ఇంకొక చక్కని స్థలపురాణం, ఇంపైన ఐతిహ్యం వుంది. కాలాంతరంలో మరొక సమయంలో జరిగిన దివ్యగాథ!

ఈ పర్వతంపైన తుంబురుతీర్థంలో పూర్వం వృషభాసురుడు అనే పేరులో ఒక రక్కసుడుండేవాడు. వాడు రాక్షసుడైనా తీవ్రమైన నరసింహస్వామి భక్తుడిగా వుండేవాడు. అయితే వాడు ఎంతటి వీరభక్తుడో అంతటి మహాక్రూరుడు. తనకంట కనపడిన మునులను, యోగులను, స్త్రీలను, మానవులను వెంట వెంటపడి తరుముతూ, హింసించి చంపేవాడు. వాని ఆగడాలకు దుశ్చర్యలకు తాళలేక అందరూ వెళ్లి శ్రీనివాసుణ్ణి వేడికొన్నారు. మహాప్రభో! వాడి బారినుండి రక్షించమని అనేకవిధాలుగా స్తుతించారు.

ఈ వృషభాసురుడు ఎంతటి క్రూరుడైనా, ఆరాధన సమయంలో పరమ సాత్వికుడిగా వుండేవాడు. ప్రతిరోజు శ్రీ నృసింహస్వామిని గూర్చి యాగం చేసేవాడు. ఆ యాగంలో చిట్టచివరగా, పూర్ణాహుతిగా తన శిరస్సును వధించి సమర్పించుకొనేవాడు. అదేమి చిత్రమో కాని, ఆ శిరస్సు ఎప్పటిలాగే వాని



మొండెంపై మొలిచేది. ఇలా ఒకవైపు వీడి హోమాలు, మరోవైపు ఆగడాలు మితిమీరిపోయాయి.

భక్తులందరి కోరికపై ఒకప్పుడు శ్రీనివాసుడు వున్నపళంగా వానిముందర ప్రత్యక్షమై దర్శనమిచ్చాడు. శ్రీనివాసుణ్ణి చూస్తూ వెంటనే విస్మయం నుండి తేరుకొని స్వామీ! శ్రీనివాస ప్రభూ! నీవు ‘కోరిన వరాలరాయడివి’ కదా! నాకొక వరం ఇవ్వు. నాతో యుద్ధం చెయ్యి. ఇదే నాకు నీవు తీర్చవలసిన కోరిక! అని చేతులెత్తి నమస్కరించినాడు.

వేంకటేశ్వరుడు వానితో యుద్ధానికి తలపడినాడు. హోరాహోరిగా జరుగుతున్న యుద్ధంలో చివరకు శ్రీనివాసుడు తన చక్రాయుధాన్ని ప్రయోగించి వాని శిరసును ఖండించపోగా వెంటనే స్వామీ! చిట్టచివరిగా నాదొక కోరిక. ఈ పర్వతం నా పేరుతో ప్రసిద్ధమగుగాక! అలాగే నీవు ఆ పేరుతోనే పిలువబడాలంటూ ఆ సుదర్శనచక్రానికి బలి అయ్యాడు.

అలా ఈ పర్వతం ‘వృషభాచలం’ అనీ ‘వృషభాద్రి’ అని పిలువబడింది. ఆ కొండపైవున్న శ్రీ వేంకటేశ్వరుడు ఆనాటినుంచి ‘వృషభాచలపతి’గా ‘వృషభాద్రీశ్వరుడు’ గా పిలువబడుతూ ఆ యా యుగాలలోని భక్తులను స్మరింపజేస్తూ వున్నాడు.

**అంజనాచలం**

‘అంజనాచలం’ ఏడవకొండ! ఈ పేరు ఏర్పడడానికి అద్భుతమైన ఒక దివ్యగాథ వినపడుతున్నది. ఇది త్రేతాయుగం నాటికి సంబంధించిన ఆశ్చర్యకరమైన గాథ.

పూర్వం ‘కేసరి’ అనే వానరరాజు వుండినాడు. ఆయన భార్య అంజనాదేవి. ఎంత కాలానికి సంతానం కలగనందువల్ల ఆమె ‘మతంగముని’ దగ్గరికి వెళ్ళి

తన బాధను వెళ్లబోసుకుంది. మతంగుడు చాలా ఆలోచించి చివరిగా అంజనాదేవికి సంతానం కలిగే మార్గం ఇలా బోధించాడు.

'అమ్మా! పంపానదికి తూర్పుదిక్కున ఐదువందల యోజనాల దూరంలో నరసింహస్వామి క్షేత్రం వుంది. దానికి దక్షిణాన 'నారాయణగిరి' అనే మహిమాన్వితమైన దివ్యక్షేత్రం ఉంది. అక్కడ ఆ క్షేత్రంలో సకలపాపహారిణి అయిన 'స్వామిపుష్కరిణి' అనే దివ్యమైన భవ్యమైన కోనేరు వుంది. ఆ కోనేటికి ఉత్తరం దిక్కున ఒక క్రోశం దూరాన 'ఆకాశగంగ' అనే పవిత్రమైన పుణ్యతీర్థం నెలకొనివుంది. అందులో ప్రతిదినం స్నానం చేస్తూ పన్నెండేళ్లపాటు తపస్సు చేస్తూవుండు. నీకు తప్పక సంతానం కలుగుతుంది. గుణవంతుడు, శ్రేష్ఠుడు, అనంత బలశాలి, సర్వలోకపూజ్యుడు అయిన పుత్రుడు నీకు కలుగుతాడు అని ఆశీర్వదించి పంపాడు.

మతంగముని ఆదేశానుసారం అంజనాదేవి వేంకటాచల క్షేత్రాన్ని చేరుకొని 'శ్రీస్వామి పుష్కరిణి'లో స్నానం చేసింది. ఆ పుష్కరిణి ఒడ్డునవున్న అశ్వత్థ వృక్షానికి ప్రదక్షిణం చేసి, ఆ పక్కనేవున్న శ్రీ ఆదివరాహస్వామివారిని దర్శించింది. పిదప 'ఆకాశగంగ' తీర్థానికి వెళ్లి అక్కడ ఉపవాసదీక్షతో ఒక ఏడాదిపాటు వ్రతమాచరించింది. తపస్సు చేసింది. ఆ తర్వాత వాయుదేవుడు ప్రతిరోజూ ఒక దివ్యఫలాన్ని అంజనాదేవి చేతిలో ప్రసాదిస్తుండగా, దాన్ని ఆమె ఆరగిస్తూ తన తపస్సును కొనసాగించింది. ఈ తపస్సుతో ఆమె పాపాలు తొలగిపోయాయి. ఒక తేజస్సు ఆమెను ఆవరించింది. ఇంతలో ఒకానొకరోజు వాయుదేవుడు తన వీర్యంతో నిండిన ఫలాన్ని ఆమెకు ప్రసాదించినాడు. ఆమె యథాక్రమంగా ప్రతిరోజు మాదిరే పండుగా భావించి భుజించగా ఆమె గర్భవతి అయ్యింది. పదిమాసాల తర్వాత ఒక పుత్రుడు కలిగాడు. అతడే 'ఆంజనేయుడు', 'హనుమంతుడు', 'వాయుపుత్రుడు' అనే పేర్లతో జగత్ప్రసిద్ధుడయ్యాడు.



ఆంజనేయుడు అవతరించిన కొండ కనుక 'అంజనాచలం' అనీ, 'అంజనాద్రి' అనీ ఈ కొండకు పేర్లు కలిగాయి. అలాగే శ్రీనివాసునికి 'అంజనాద్రీశ్వరుడు' అనే పేరు సార్థకమయ్యింది.

ఇలా ప్రసిద్ధంగా తిరుమలక్షేత్రానికి ఏడు పేర్లు కలిగాయి. అందువల్లే స్వామి 'ఏడుకొండలవాడు'గా పిలువబడుతున్నాడు.

ఇంతకు ఈ పర్వత శిఖరాల్లో కేవలం ఏడుకొండలు మాత్రమే ఉన్నాయనుకుంటున్నారా?

ఈ తిరుమల కొండకు ఏడుపేర్లు మాత్రమే ఉన్నాయనుకుంటున్నారా? కానేకాదు. ఈ కొండకు ఉన్న ప్రధానమైన పేర్లు మాత్రమే ఇవి. ఆ యా యుగాల్లో జరిగిన దివ్యగాథలననుసరించి భక్తులు ప్రియాతిప్రియంగా పిలుచుకుంటున్న పేర్లు ఏడు మాత్రమే. అయినా అనాదిగా ఈ పర్వతక్షేత్రానికి ఎన్ని పేర్లు ఉన్నాయో ఎన్నెన్ని పేర్లతో పిలువబడుతున్నదో ఎవరికెరుక?

ఆకాశంలోని నక్షత్రాలను లెక్కించవచ్చునేమో! సముద్రంలోని నీటి కణాల్నికూడా లెక్కగట్టవచ్చునేమో! అలానే భూమిమీది దుమ్ము రేణువులను కూడా లెక్కించవచ్చునేమో కాని ఘనమైన ఈ తిరుమల కొండకు వున్న పేర్లనుగాని వాటి మహిమలనుగాని, అందు కొలువైవున్న శ్రీనివాస ప్రభువు లీలలనుగాని లెక్కించడానికి ఎవరికీ సాధ్యం కాదు. అయినప్పటికీ ఆ అనంతమైన పేర్లలో తెలిసినంతవరకు, తెలియవచ్చినంత వరకు కొన్నింటి పేర్లను తెలుసుకుందాం.

పూర్వం ఎప్పుడో, ఏనాడో బ్రహ్మాది దేవతలంతా కలిసి భూలోక వైకుంఠమైన వేంకటాచలానికి చేరుకొన్నారు. అక్కడ ఆ క్షేత్రంలో శ్రీదేవీభూదేవీ సమేతంగా శ్రీనివాసుడు లీలామానుష విగ్రహమూర్తిగా విహరిస్తూ వుండినాడు. కొన్ని వేళల్లో దయాంతరంగుడైన వేంకటాచలపతి, భక్తులైన కొందరు యోగులకు,

పరమమునులకు, దేవతలకు మాత్రం దర్శనమిస్తూ మిగిలిన వేళల్లో అదృశ్యుడై వుండేవాడు. ఒకానొక సందర్భంలో ఈ స్వామిని దర్శించిన బ్రహ్మాది దేవతలు పెక్కు విధాలుగా ప్రార్థించాడు.

స్వామీ! వచ్చేది కలియుగం కదా! కలియుగంలోని మానవులు అత్యంత బలహీనులు. అల్పాయుష్కులు. ఆ కొద్దిపాటి జీవితంలో కూడ వారికి ఎన్నో తాపత్రయాలు. మరెన్నెన్నో ఆర్తులు. ఈతిబాధలు. అందువల్ల కలియుగంలోని భక్తులను రక్షించడం కొరకు, ఈ దివ్యక్షేత్రంలోను అద్భుత సాలగ్రామ శిలామూర్తిగా ఆవిర్భవించి దర్శనాన్ని ప్రసాదించు. కలియుగంలోని మానవులందరి ఆవేదనల్ని తీర్చు! ఆర్తుల్ని పోగొట్టు స్వామీ! అంటూ అనేకవిధాల ప్రార్థించారు.

సరే! నంటూ శ్రీ మహావిష్ణువు శ్రీదేవి భూదేవీ సమేతంగా 'శ్రీ వేంకటేశ్వరుడు' అనే పేరుతో భక్తవరదుడిగా పిలిస్తే పలికే ప్రత్యక్షదైవంగా, "కలౌ వేంకటనాయకః" అన్న బిరుదుతో ఈ కొండపై కొలువైవున్నాడు.

ఆనాటినుండి కేవలం ఏడుకొండల పేర్లతోనే గాక, ఆ యా కాలాల్లో ఆ యా పేర్లతో పిలువబడిన దివ్యక్షేత్రం ఈ తిరుమల కొండ!

సంపదలు కావాలి, ఐశ్వర్యం కావాలి అని సేవిస్తే చాలట! ఈ కొండ వెంటనే చింతామణిలాగా సకల సంపదలను ప్రసాదిస్తుందట? అందువల్లే "చింతామణిపర్వతం" అని ప్రసిద్ధి కెక్కింది.

మరికొంతమంది భక్తులు తమకు నశ్వరమైన సంపదలు వద్దే వద్దు. శాశ్వతమైన పరిపూర్ణమైన జ్ఞానం కావాలి అని ఈ క్షేత్రంపై సాధన చేస్తే చాలట! అంతే జ్ఞానాన్ని ప్రసాదిస్తుందట. అందువల్లే "జ్ఞానాద్రి" అయ్యింది. ఇదే జ్ఞానాచలం! అంతమాత్రమే కాదు.



ఈ సప్తగిరి సానువుల్లో అనేకమైన తీర్థాలు వున్నాయి. ఆ తీర్థాలు ఎన్నో ఎన్నెన్నో ఆ వేంకటేశునకే తెలియాలి. మరి తీర్థాలు సాధారణమైనవి కావట! కొన్ని తీర్థాల్లో స్నానం చేస్తేచాలట! పాపాలు పోతాయట! కొన్ని తీర్థాలను దర్శిస్తే చాలట ఇష్టార్థ సిద్ధి కలుగుతుందట! మరికొన్ని తీర్థాలను దూరం నుంచే స్మరిస్తే చాలట! స్మరణం చేతనే అందులో స్నానం చేసినంత ఫలం కలగడమే గాక కోరిన వరాలన్నీ తీరతాయట! ఇలాంటి అద్భుతమైన, ఆశ్చర్యమైన తీర్థాలు తిరుమలకొండలో వెలసివున్నందువల్ల ఈ కొండ అనాదిగా "తీర్థాద్రి" అనీ 'తీర్థాచలం' అని పిలువబడుతున్నది.

అలాగే ఈ దివ్యక్షేత్రంలో అనేకమైన పుష్కరిణులు అనగా కోనేరులు చోటు చేసుకున్నాయి. ఇవన్నీ పరమపావనములై భక్తుల సర్వపాపహరిణులుగా విలసిల్లుతున్నందువల్ల ఈ కొండ "పుష్కరాద్రి" అనీ, "పుష్కరాచలం" అని "పుష్కరశైలం" పేర్లతో పిలువబడుతున్నది.

దీనికివున్న మరోపేరు వైకుంఠాద్రి! గరుత్మంతుడు శ్రీనివాసుని ఆనతిపై సాక్షాత్తు శ్రీ వైకుంఠాన్ని ఇక్కడికితెచ్చి స్థాపించినందువల్ల ఇది "వైకుంఠాద్రి" అయ్యింది. ఇదే వైకుంఠాచలం!

ఒకానొక యుగంలో ఈ దివ్యక్షేత్రం 'ఆదివరాహ క్షేత్రం' అనీ, శ్వేతవరాహ క్షేత్రం, అనే పేర్లతో ప్రసిద్ధికెక్కింది. అందుకుకారణాలు ఏమిటంటే

హిరణ్యాక్షుని బాధలు పొందుతున్న భూలోకవాసుల్ని, భూదేవిని రక్షించడంకోసం, శ్రీ మహావిష్ణువు భయంకరమైన శ్వేతవరాహ రూపాన్ని ధరించాడు తిరుమలేశుడు. అప్పటి భయంకర వాతావరణాన్ని కాస్త తగ్గింపజేస్తు ఆదివరాహస్వామి హిరణ్యాక్షుని తన వాడి కోరలతో పొడిచి వధించాడు. అదే కోరలతో భూదేవిని ఉద్ధరించాడు. అక్కడే ఆదివరాహ రూపంలో భూదేవితోడ నిలిచాడు స్వామి. అందువల్ల ఇది "ఆదివరాహ క్షేత్రం" అనీ, తెల్లగా ఆ

స్వామి ఉన్నందువల్ల "శ్వేతవరాహ క్షేత్రం" అనీ భూదేవీలో కలిసి వున్నందువల్ల "శ్రీ భూవరాహక్షేత్రం" అనీ అనేకపేర్లతో ప్రశస్తిని పొందింది. ఒకానొకప్పుడు 'నీలుడు' అనే భక్తుడు ఈ క్షేత్రంలో తపస్సాధన చేస్తూ సిద్ధిని పొందినాడు. మోక్షాన్ని పొందాడు. అందువల్లే ఆ మహనీయుని పేరుమీద "నీలాద్రి" అని పిలువబడుతున్నది. అదే "నీలాచలం".

ఇంకా శ్రీనివాసుడు తన దేవేరులతో క్రీడిస్తూ విహరించిన స్థలం కనుక క్రీడాద్రి. అదే "క్రీడాచలం"

వక్షఃస్థల శ్రీ మహాలక్ష్మితో శ్రీనివాసుడను పేరుతో 'ఆనందనిలయం' అనే బంగారు శిఖరాలతో కూడివున్న అద్భుతమైన మేడలో కొలువై ఆనందమయ స్వరూపుడై దర్శనమిస్తున్నందువల్ల ఈ కొండ 'ఆనందాచలం' అనీ, శ్రీ మహాలక్ష్మితోకూడి, సర్వసంపదలను అనుగ్రహిస్తూ శ్రీనివాసుడు విహరించే దివ్యధామం కనుక 'శ్రీశైలం' అనీ, ఇలా అనేకానేకమైన పేర్లతో ప్రసిద్ధికెక్కింది తిరుమలకొండ.

**బహూని చాస్య నామాని కల్పభేదాద్భవంతి హి**
**యావదుక్తా భగవతః కల్యాణగుణరాశయః**
**తావంతోఽస్య గిరేస్సంతి గుణాః పరమపావనాః**
**అస్య వేంకటశైలస్య మాహాత్మ్యం యావదస్తి హి**
**తావద్వక్తుం చ కార్త్స్న్యేన న సమర్థశ్చతుర్ముఖః**
**షణ్ముఖశ్చ సహస్రాస్యః ఫణీ దేవాః పరేకము?**

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన, తిరుమల పరంధాముని కల్యాణ గుణపరంపరలు అవి ఎన్నో, ఎన్నెన్నో ఎవరికెరుక? ఈ క్షేత్రరాజం యొక్క నామాలు మహిమాన్వితాలై గుణాలతో ఆయా కల్పబేధాలనుబట్టి అసంఖ్యాకములై వర్ధిల్లుతున్నాయి. అంతటి గొప్ప మహిమ గలిగిన వేంకటాచల



పర్వతాన్ని గురించిగాని, లెక్కపెట్టలేని, అసంఖ్యాకములుగా వున్న దీని పేర్లనుగాని వివరించడానికి, నాలుగు తలలున్న బ్రహ్మదేవునికిగాని, ఆరు తలలున్న కుమారస్వామికి గాని, వేయితలలున్న ఆదిశేషునికిగాని, ఇతర దేవతాసమూహానికి గాని ఎన్నటికీ సాధ్యం కానేకాదు.

## వేంకటపతి

అడుగడుగు దండాలవాడు, ఆపద్బాంధవుడు అయిన ఈ ఏడుకొండలవాణ్ణి మరి కొందరయితే 'వేంకటపతీ!' అని నోరార పిలుస్తారు. వేం = పాపాలను, కటః = పోగట్టే స్వామి, కనుకనే వేంకటపతి. అంతేకాదు, వేం = అమృతత్వాన్ని అనగా మోక్షాన్ని కట = ప్రసాదిస్తాడట! అంటే ఆయన చేస్తున్న కార్యాలను (Duty) (ఒకటి పాపాలను పోగొట్టడం, మరొకటి మోక్షాన్ని ప్రసాదించడం వంటి పనులతో సార్థకమైన పేర్లతో పిలిపించుకొంటున్న స్వామికి అసలు పేరేమిటో? ఎవరికి తెలుసు?

## శ్రీనివాసుడు

ఇంకొందరయితే స్వామీ! "శ్రీనివాసా!" అని ఆప్యాయంగా పిలుస్తారు! ఇదీ మరీ విచిత్రమైన పేరు. విడ్డూరమైన పేరు. ఎందుకంటే తనకంటూ ప్రత్యేకంగా పేరు లేక, తన భార్య పేరుతో పిలిపించుకొంటున్న స్వామి ఘనశ్రీనివాసుడు!

శ్రీ అనగా లక్ష్మీదేవి. శ్రీమహాలక్ష్మిని తన వక్షఃస్థలంమీద అనగా గుండెమీద పదిలంగా ప్రతిష్ఠించు కొన్న స్వామి. కనుకనే 'శ్రీనివాసుడు' అయ్యాడు. బాగుంది. ఆ లక్ష్మీదేవి ఆయన గుండెలమీద ఎలాగుంది? ఏం చేస్తుంది? అంటే!

**ఈశానాం జగతోఽస్య వేంకటపతే ర్విష్ణోః పరాంఽప్రేయసీం**
**తద్వక్షఃస్థలనిత్యవాసరసికాం త క్షాంతిసంవర్ధినీం**

**పద్మాలంకృత పాణి పల్లవయుగాం పద్మాసనస్థాం శ్రియం**
**వాత్సల్యాదిగుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్.**

వేంకటేశ్వరుని వక్షఃస్థలంమీద 'వ్యూహలక్ష్మి' పేరుతో పదిలంగా, ముందుకు చొచ్చుకొని ఉబ్బెత్తుగా వుంటుందట ఆ తల్లి! "ద్విభుజా వ్యూహలక్ష్మీ" అన్నట్లు శ్రీస్వామివారి వక్షఃస్థలంమీద రెండు భుజాలతో, రెండుచేతుల్లో పద్మాలను ధరించి పద్మాసనస్థగా వేంచేసి వుందట శ్రీమహాలక్ష్మి! 'వాత్సల్యాది గుణోజ్జ్వలాం' అనగా అప్పుడే యీనిన ఆవు తన వత్సను అనగా దూడను తన నాలుకతో నాకి శుభ్రం చేస్తుందట! అలాగే ఆ అమ్మవారు భక్తుల పాపాలను, దోషాలను పోగొట్టడమేగాక స్వామివారిచేత వరాలను ప్రసాదింపజేస్తుందట!

అంతేకాదు

**శ్రీవత్సవక్షసం శ్రీశం శ్రీలోలం శ్రీకరగ్రహమ్**
**శ్రీమంతం శ్రీనిధిం శ్రీద్యం శ్రీనివాసం భజేఽ నిశమ్**

ఆ దేవుడు వక్షఃస్థలంలో 'శ్రీవత్సం' అనే గుర్తును కలిగివున్నాడు. ఆ దేవదేవుడు సాక్షాత్తు లక్ష్మీపతి! ఆ స్వామి లక్ష్మీదేవితో కలిసి విలాసాలలో మునిగి వుంటాడు. లక్ష్మీదేవి చేతిని గ్రహించినవాడు కూడా ఆయనే! ఇంకా తిరుమలేశుడు సకల విద్యాపరిపూర్ణుడు! సమస్తైశ్వర్య సంపూర్ణుడు కూడా! అంతమాత్రమే కాదు. సాక్షాత్తు వక్షఃస్థల మహాలక్ష్మి అయిన వ్యూహలక్ష్మిచేత నిరంతరం ధ్యానింపబడుతూ స్తుతింపబడే తిరుమలేశుడు "శ్రీనివాసుడు"గా పిలవబడుతున్నాడు.

ఇలా ఇన్ని పేర్లతో పిలువబడుతున్న వేంకటేశ్వరుణ్ణి స్వామీ! నీ అసలు పేరు ఏమిటయ్యా! అని ప్రశ్నిస్తే ఆయన అంటాడు కదా! నా పేరు ఏదైతే ఏమి? నా అసలు పేరుతో నీకేమి పని? నీవు ఏ పేరుతో పిలిచినా పలుకుతూ, నీ వడిగినవన్నీ ఇస్తున్నా కదా! నీ కోరికలను తీరుస్తున్నాను కదా! అంటాడు.



ఇలా అద్భుతంగా పెట్టుడు పేర్లతో పిలిపించుకుంటున్న స్వామి వేంకటేశ్వరుడు! అందుకే కో! అని పిలిస్తే ఓ! అని వెంటనే పలుకుతూ ఆ స్వామి ప్రత్యక్షదైవంగా భాసిస్తున్నాడు ఈ తిరుమలకొండల్లో కోనల్లో!!

## విచిత్ర భంగిమ

వేంకటాచలం అద్భుతమైన కొండ అని తెలుసుకున్నాం. అందువున్న వేంకటేశుని పేర్లు అద్భుతమే! అని కూడా తెలుసుకున్నాం, ఇక ఆ కొండలో 'ఆనందనిలయం' అనే బంగారుమేడలో శ్రీనివాసుడు విచిత్రభంగిమలో నిలిచివుంటూ దర్శనమిస్తున్న రీతి, తీరు కూడ పరమవిచిత్రం! ఆశ్చర్యకరం! ఆనందకరం!!

**భవాబ్ధితారం కటివర్తిహస్తం**
**స్వర్ణాంబరం రత్నకిరీటకుండలమ్**
**ఆలంబిసూత్రోత్తమ మాల్యభూషితం**
**నమామ్యహం వేంకటశైలనాయకమ్**

అని ప్రార్థింపబడుతున్న స్వామి పై కుడి, ఎడమ చేతుల్లో శంఖచక్రాలను, క్రింది కుడిచేతిని వరదహస్త ముద్రలో వుంచి, తన పాదద్వయాన్ని చూపుతున్నాడు. అలాగే తన క్రింది ఎడమచేతిని కటిపై అనగా నడుముపై వుంచి, మోకాళ్లను చూపుతున్నాడు. విచిత్రమైన యీ భంగిమలో, స్వామి తాను నిలిచివున్నదే సాక్షాత్తు శ్రీవైకుంఠం! అంతేగాక నా యీ పాదాలను శరణువేడు. అలా ఎవరైతే "అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ" అంటూ నా పాదాలపై శరణాగతి చెందుతారో, వారిని ఉద్ధరిస్తాను. అలాంటివారికి

**'సంసారసాగరసముత్తరణైకసేతో'**

అన్నట్లు సేతువునై సంసార సముద్రాన్ని మోకాళ్లబంటిలోతు చేసి సులువుగా దాటిస్తాను. అలా దాటించడమేగాక మీరు కోరినవరాలనన్నింటిని వరప్రదానం చేస్తానని "వరదహస్తం"తో చూపుతూ ఒక సొంపైన "భంగిమ"లో నిలిచివున్నాడు.

ఆ స్వామివారు విచిత్రంగా ఒయ్యారంగా నిలిచివున్న భంగిమను ఆశ్చర్యంగా తిలకిస్తూ ఒక అజ్ఞాతకవి ఇలా ప్రశ్నిస్తాడు.

**కుడిహస్తం బిటు చూపుచంద మిది వైకుంఠంబనే యందమో**
**జడధివ్రాత పరీత భూభవన రక్షా దక్షిణంబైన నీ**
**యడుగుల్ చూడుమనేవొ, కాక యొక యొయ్యారంబొ? సందేహమై**
**యడిగే నానతి యిమ్ము వేంకటనగాధ్యక్షా! జగద్రక్షకా!!**

ఆ అజ్ఞాత మహాభక్తుని సందేహంలోనే ఒక చక్కని సమాధానం స్ఫురింపజేస్తూ, శ్రీ స్వామివారి భక్తవాత్సల్యాన్ని ప్రస్ఫుటం చేస్తున్నది.

## అబ్బురపరిచే ఆభరణాలు

శ్రీ వేంకటేశ్వరస్వామివారి పేర్లు విచిత్రమే! భంగిమా విచిత్రమే! ఇక ఆ స్వామివారికి అలంకరించే దివ్యాభరణాలు విచిత్రాతి విచిత్రం. ఘనవేంకటేశునకు పాదాదిగా శిరస్సు వరకు అలంకరించిన ఎన్నో దివ్యాభరణాలు, మణిహారాలు, భక్తులను ఆశ్చర్యపరుస్తుంటాయి. విస్మయ పరుస్తుంటాయి. అవి జిగేలుమంటూ కన్నులకు మిరుమిట్లు గొలుపుతూ ఆనందాన్ని కలిగిస్తాయి.

### మోహనరాగం

**చూడ జూడ మాణిక్యాలు చుక్కలవలె నున్నవి**
**యీడులేని కన్నులవె యినచంద్రులు ॥**



**కంటి గంటి వాడె వాడె ఘనమైన ముత్యాల**
**కంటమాల లవె పదకములు నవె**
**మింటి పొడవైనట్టి మించు కిరీటం బదె**
**జంటల వెలుగు శంఖచక్రా లవె**

**మొక్కు మొక్కు వాడె వాడె ముందరనె వున్నాడు**
**చెక్కులవే నగవుతో జిగిమోమదె**
**పుక్కిట లోకము లవె భుజకీర్తులును నవె**
**చక్కనమ్మ అలమేలు జవరాలదె**

**ముంగైమురాలును నవె మొలకతారును నదె**
**బంగారునిగ్గులవన్నె పచ్చబట్టదె**
**యింగిత మెరిగి వేంకటేశుడిదె కన్నులకు**
**ముంగిటి నిధానమైన మూలభూతమదే ॥**

ఇలా స్వామివారు నిలువెత్తుగా అలంకరించుకున్న నగలను, ఆభరణాలను అన్నమాచార్యులవారు వర్ణిస్తారు.

పద్మపీఠం, బంగారు పాదకవచాలు, స్వర్ణ పీతాంబరం, బంగారు ఖడ్గం అనబడే సూర్యకటారి, వజ్రాలుతాపిన సూర్యకటారి అనే ఖడ్గం, వైకుంఠహస్తం, వరదహస్తం (బంగారు కవచాలు మరియు వజ్రాలు తాపిన కవచాలు), రెండు చేతులకు వుండే బంగారు కవచాలు. రెండు చేతులకు నాగాభరణాలు (వంకీలలాగా), వక్షఃస్థల అమ్మవార్ల ప్రతిమల కంటెలు, బంగారు సహస్రనామ సాలగ్రామ హారాలు, లక్ష్మీహారం, నాలుగుపేటల బంగారు మొహరీల గొలుసు, సహస్రనామ మాలలు, భుజకీర్తులు, శంఖచక్రాలకు బంగారు కవచాలు, వజ్రాలు తాపిన శంఖచక్రాలు, బంగారు కిరీటాలు, వజ్రకిరీటాలు, మకరతోరణం ఇలా ఎన్నో... ఎన్నెన్నో!..

ఇలాగ శ్రీవారికి అలంకరింపబడే నగలలో ఇవి కొన్ని మాత్రమే. ఇంకా ఎన్నో రకాల నవరత్నాల హారాలు, ముత్యాలహారాలు, విశేష దినాల్లో విశేషంగా అలంకరించే మరెన్నెన్నో దివ్యాభరణాలు శ్రీవారి భాండారంలో వున్నాయి. ఇవి మణుగులకొద్దీ బరువుతోపాటు వెలకట్టలేని వెలకట్టగ సాధ్యంగాని అమూల్య సంపదగా విరాజిల్లుతున్నది.

ఈ నగలను ఏ భక్తులు ఇచ్చారో, ఎందుకు ఇచ్చారో, ఎప్పుడిచ్చారో ఎవరికెరుక! తెలిస్తే 'స్వామివారికి ఒక్కనికి' మాత్రమే తెలియాలి.

కోరిన వరాలరాయడైన కొండలరాయడికి, కోరికలు తీరిన భక్తులు వజ్రాలు, మణులు, బంగారునగలను కానుకలుగా సమర్పించి వుంటారు. ఆ భక్తులు కానుకపెట్టిన ఆభరణాలను అలంకరించుకొని ఆనందనిలయుడు భక్తులను అలరింపజేస్తున్నాడు, ఆనందింపజేస్తున్నాడు. సరే బాగుంది.

కాని స్వామివారికి నగలు అలంకరిస్తే ఒక అందం! నగలు లేకపోయినా అందంగానే కనబడతాడు. నగలు లేకుండా గురువారం నేత్రదర్శనంలో నేత్రపర్వంగా దర్శనమిస్తాడు. గురువారం రాత్రి పూలంగి సేవలో పులకింపజేస్తాడు. శుక్రవారం అభిషేకంలో భక్తుల్ని మైమరపిస్తాడు స్వామి.

**కంటి శుక్రవారము గడియ లేడింట**
**అంటి అలమేల్మంగ అండనుండే స్వామిని**

**సొమ్ములన్నీ కడబెట్టి సొంపుతో గోణముగట్టి**
**కమ్మని కదంబము కప్పు పన్నీరు**
**చెమ్మతోడ వేష్టువలు రొమ్ము తలచుట్టి**
**తుమ్మెద మైచాయతోన నెమ్మదినుండే స్వామిని.**

**పచ్చకప్పురమె నూఱి పసిడిగిన్నెలనించి**
**తెచ్చి శిరసాదిగ దిగనలది**



**అచ్చెరపడి చూడ అందరి కన్నులకింపై**
**నిచ్చమల్లెపూవు వలె నిటు తానుండే స్వామిని.**

**తట్టుపునుగే కూరిచి చట్టలు చేరిచి నిప్పు**
**పట్టి కరగించి వెండి పళ్యాలనించి**
**దట్టముగ మేనునింత పట్టించి దిద్ది**
**బిట్టు వేడుక మురియుచుండే బిత్తరి స్వామిని.**

ఇలాగ ఎలాంటి ఆభరణాలుగాని, వస్త్రాలు లేకుండా కేవలం కౌపీనంతో వుంటూ శుక్రవారాభిషేకంలో దర్శనమిచ్చే శ్రీ వేంకటేశ్వరుని దర్శించిన వారి భాగ్యం ఏమని వర్ణించగలం?

స్వామివారి మూర్తిలో మరో అద్భుతమైన విషయం ఏమంటే ఒకే భక్తునికి ఒకే రోజున నాలుగు వేళల్లో నాలుగు రకాలుగా దర్శనాన్ని, వేర్వేరు అనుభూతులతో ప్రసాదిస్తాడు. అంతమాత్రమేగాక ఒకేసమయంలో నలుగురు భక్తులకు నాలుగు రకాలుగా దివ్యానుభూతులతో దర్శనం ప్రసాదిస్తున్న దివ్యమంగళమూర్తి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి మూలవిరాణ్మూర్తి.

## కమ్మని ఆరగింపులు

ఆనందనిలయుడు అలంకారప్రియుడు! అంతకంటె మిక్కిలి ఆహారప్రియుడు! అంతకంటె కూడ భక్తప్రియుడు! భక్తుల కోసమే తాను ఎన్నో, ఎన్నెన్నో కమ్మగావున్న దివ్యాన్నాలను, పిండివంటల్ని పుష్టిగా, సుష్టుగా ఆరగిస్తాడు శ్రీనివాసుడు.

ఉదయం పాలు, వెన్న మొదలుకొని వరుసగా పొంగళ్లు, పులిహోర, చక్కెరపొంగలి, దధ్యోదనం, క్షీరాన్నం, పాయసం, కదంబం, ముళహోర, కట్టెపొంగలి, సిరా, కేసరి, లడ్డులు, వడలు, అప్పాలు, దోసెలు, జిలేబీలు, తేనెతొళలు, పోళీలు, సుఖియలు, గుగ్గిళ్లు – ఇలా ఎన్నింటినో తృప్తిగా ఆరగిస్తున్న

స్వామి ఆనందనిలయుడు. తన చూపులతో ఆ పదార్థాలన్నింటిని పవిత్రం చేసి, ఆస్వాదించి, తన భుక్తశేషాన్ని ప్రసాదాలుగా భక్తులకు ప్రసాదిస్తాడు. ఆ దివ్యప్రసాదాలు స్వీకరించిన భక్తులకు పుష్టీ, తుష్టీ, సంతుష్టీ కలుగుతాయి. దానితోపాటు ఎన్నో కోరికలు నెరవేరడంతోపాటు వారి వారి అంతుబట్టని రోగాలు ఇట్టె మాయం అవుతాయి. ఆరోగ్యం సంపూర్ణంగా కలుగుతుంది.

ఇన్ని ప్రసాదాలతోపాటు వీటన్నిటితోపాటు ఒక్కొక్కరోజు ప్రత్యేకంగా అదనంగా విశేష వంటకాలు నివేదింపబడతాయి. ఆదివారం 'అమృతకలశం' అనే చలిమిడి పిండి, సోమవారం పెద్దవడలు, బుధవారం క్షీరాన్నం, గురువారం జిలేబీలు, తేనెతొళలు అనే మురుకులు, శుక్రవారం పోళీలు (పూర్ణంభక్ష్యాలు) సుఖియలు వంటి ప్రసాదాలు నివేదింపబడతవి.

**ఇందిర వడ్డించ ఇంపుగను**
**చిందక ఇట్లే భుజించవో స్వామి!**

**అక్కాళపాశాలు, అప్పాలు, వడలు**
**పెక్కైన సయిదంపు పేణులు**
**సక్కెర రాసులు సద్యోఘృతములు**
**కిక్కిరియ నారగించవో స్వామి**

అంటూ స్వామివారిని ఆరగించమని ప్రేరేపిస్తాడు తాళ్లపాక అన్నమాచార్యులు. మరోచోట వేంకటేశ్వరుని ఆరగించే కమ్మనైన విందును వర్ణిస్తూ ఇలా అంటాడు అన్నమయ్య.

**అరిసెలు నూనె బూరియలు నౌగులు**
**జక్కెర మండగల్ వడల్**
**బురుడలు, పాలమండెగ లపూపము**
**లయ్యలమేలుమంగ నీ**



**కరుదుగ విందువెట్టు బరమాన్న**
**శతంబుల సూపకోట్లతో**
**నిరత వినిర్మలాన్నములు**
**సోనల వేంకటేశ్వరా!!**

మరో అజ్ఞాతకవి తిరుమల వేంకటేశ్వరుని భోజన ప్రియత్వాన్ని చాటుతూ, ఆ స్వామి ఆరగించే పిండివంటల పేర్లను ఇలా ఏకరువు పెట్టాడు.

**"పాలు, వెన్న, బకాళబాతు, దధ్యోదనం**
**బువుళి, యోరెము వెన్నబూరియలు**
**సరదాల పాశముల్, చక్కెర పులగముల్**
**నువ్వుమండిగలు మనోహరములు**

**అప్పము లిడ్డెన లతి సారముల్ హోళిగల్**
**వడలు, దోసెలు, గల వంటకములు**
**శాకముల్ సూపముల్ చారు లంబళ్లు**
**శుద్ధోదనములును, సద్యోఘృతమ్ము**
**పండ్లు తేనె హొబ్బట్లు పచ్చడులును"**

ఇలా ఆరగించే పదార్థాల్లో ఇవి కొన్ని మాత్రమే. ఇలా ఉదయం నుంచి రాత్రివరకు ఆనందనిలయుడైన శ్రీనివాసుడు ఆరగించే పిండివంటల్ని, దివ్యాన్నాలను వరుసగా లెక్కపెట్టలేక తెనాలి రామకృష్ణకవి 'తిండిమెండయ్య గారు' అంటూ తిరుమలేశునికి ఒక పెద్ద బిరుదును తగిలించి, ఆ స్వామివారి భోజనప్రియత్వాన్ని చాటినాడు.

ఇలా ఇన్నివిధాలుగా పొగడబడిన స్వామివారు మాత్రం తన భోజనాన్ని తోమని పళ్లాల్లో ఆరగిస్తాడు. భోజనం చేసిన పళ్లాలను కడగి పెట్టకుండా

పారవేస్తారు. మళ్లీ కొత్త పళ్లాలు! అవేమిటంటే మట్టికుండలు. అదికూడ సగం పగిలిన మట్టికుండ! అదే ఓటికుండ! దాన్నే 'ఓడు' అంటారు. ఆ ఓడులో మాత్రమే ఆరగించే ఆనంద నిలయుని వైభోగం వైభవం ఇదా అని భక్తులు ఆశ్చర్యపోక తప్పదు మరి!

ఇలా ఎప్పటికప్పుడు తోమనిపళ్లాల్లో విందు నారగిస్తున్న వేంకటేశుణ్ణి అన్నమయ్యతోపాటు మనమూ కీర్తించుదాం.

**వేడుకొందామా! వేంకటగిరి వేంకటేశుని!**
**ఆమటి మొక్కులవాడే ఆదిదేవుడే వాడు**
**తోమని పళ్లాలవాడే దురితదూరుడే**
**వడ్డికాసులవాడే వనజనాభుడే పుట్టు -**
**గొడ్డురాండ్రకు బిడ్డల నిచ్చే గోవిందుడే**
**ఎలమి గోరిన వరాలిచ్చే దేవుడే వాడు**
**అలమేల్మంగా శ్రీ వేంకటాద్రినాథుడే**

## వింత వింత మొక్కుబడులు

"పుర్రెకో బుద్ధి, జిహ్వకో రుచి" అన్నట్లు ఎన్నెన్ని పుర్రెలున్నా, వాటి ఆలోచనలు మరెన్నివున్నా ఆ ఆలోచనలకు తగ్గట్లు ఎన్నెన్నో అభిరుచులున్నా, ఆ అన్నింటి ఆలోచనలకూ, అభిరుచులకు అనువైన దేవుడు తిరుమల వెంకన్న! కనుకనే తాళ్లపాక అన్నమయ్య

**"ఎంతమాత్రమున నెవ్వరు దలచిన అంతమాత్రమే నీవు**
**అంతరాంతము లెంచి చూడ బిండంతె నిప్పటి యన్నట్లు"**

అని స్వామివారిని కీర్తించాడు.



ఆచార వ్యవహారాలు వేర్వేరు అయినా, వారి భాష ఒక్కటి కాకపోయినా, వారు మొక్కులను వింత వింతలుగా చెల్లించినా వాటినన్నింటిని స్వీకరించి వారు కోరిన కోరికలను తీరుస్తున్న స్వామి తిరుమలేశుడు. అసలు మొక్కుబళ్ల మిషతోనే భక్తులను తన దగ్గరికి రప్పించుకుంటాడట స్వామి! అందువల్లే స్వామి మొక్కుబళ్ల దేవుడిగా, ఆపదమొక్కులవాడిగా ప్రసిద్ధి కెక్కినాడు.

### తలనీలాల సమర్పణం

తిరుమల చేరుకొన్న భక్తులు ముందు సమర్పించే ప్రధానమైన మొక్కు తలనీలాల సమర్పణ. తరతమ భేదం లేకుండా స్త్రీలు, పురుషులు, పిల్లలు, పెద్దలు, కన్యలు, ముత్తైదువులు, పూర్వసువాసినులు, సాధువులు, సన్యాసులు... ఇలా తమ తలనీలాలను సమర్పించుకుంటారు, కొందరు పూర్తిగా తమ తలనీలాలను సమర్పిస్తే, కొందరు కేవలం మూడు కత్తెరలు సమర్పించుకొంటారు. ఈ మొక్కు ఎప్పటినుంచి తిరుమల క్షేత్రంలో కొనసాగుతున్నదో, తెలియకపోయినా 19వ శతాబ్దం తొలినాళ్లలోనే విస్తృత ప్రచారంలో వున్నట్లు స్పష్టమవుతున్నది. తలచిక్కులను స్వీకరించి, భక్తుల చిక్కులనన్నింటిని తీరుస్తున్న తిరుమలేశుడు నిజంగా ఆ భక్తులపాలిట ఆపద్బాంధవుడు కదా!

అలాగే కొందరు భక్తులు, శ్రీవారికి ఉత్సవాలు చేయిస్తారు. సేవలు చేయిస్తారు. పుష్పాలను సమర్పించుకొంటారు. మరికొందరు నగలను, ఆభరణాలను కానుక పెట్టుకుంటారు.

విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు 1513 నుంచి 1521 వరకు ఏడుమార్లు తిరుమల యాత్ర చేశాడు. తన విజయ పరంపరలకు గుర్తుగా తిరుమలేశునికి అనేకరకాలైన మొక్కుబడులు సమర్పించుకొన్నాడు కృష్ణదేవరాయలు.

నవరత్నఖచిత కిరీటాన్ని, 25 వెండిపళ్లాలను, అమూల్యమైన వజ్రాభరణాలను, ఉత్సవమూర్తులకు మణిమయమైన కిరీటాలతోపాటు బంగారు మకరతోరణాన్ని, నివేదనకుగాను బంగారు గిన్నెలను, కానుకలుగా సమర్పించడంతోపాటు, ఆనంద నిలయ విమానానికి బంగారుపూత చేయించాడు. ఆ తర్వాత అచ్యుతరాయలు, వెంకటపతిరాయలు... ఇలా ఎందరెందరో చక్రవర్తులు జగత్సార్వభౌముడైన సప్తగిరీశునకు అనేక మొక్కుబడులను సమర్పించారు.

కొందరు భక్తులు నివేదనలు కూడ సమర్పిస్తారు. ఇంకా మొక్కుబళ్లలో భాగంగా పాదయాత్రల్ని చేస్తారు. జోగి ఎత్తుకొంటూ తిరుమలకు వస్తారు. నిలువుదోపిళ్లు ఇస్తారు. ముడుపులు సమర్పిస్తారు. తులాభారాలిస్తారు. ఆలయ ప్రదక్షిణల్ని, అంగప్రదక్షిణల్ని చేస్తారు. అఖండ దీపారాధనలను వెలిగిస్తారు. కొబ్బరికాయలను కొడ్తారు. చలిపిండ్లను నివేదిస్తారు. పులిహోరలు, పొంగళ్లను నివేదిస్తారు. సంతానం కలిగినవారు వెండి, బంగారు ఊయళ్లను సమర్పిస్తారు.

తిరుమలేశునికి ఏడాదిపొడవునా జరిగే అనేక ఉత్సవాల్లో, ఊరేగింపుల్లో ముందుభాగాన నడిచే గజ, తురగ, వృషభాలను కూడ కానుకలుగా, మొక్కుబళ్లుగా సమర్పించడం కద్దు. నాడు మైసూరు మహారాజులు, నేడు కర్నాటక ప్రభుత్వంవారు శ్రీవారికి ఏనుగలను కానుకలుగా సమర్పించారు. ఇవేగాక ఆ యా కంపెనీలు తమ మొదటి ఉత్పత్తులైన లారీలు, కార్లు, స్కూటర్లు మున్నగు వాహనాలను మొక్కుబడులుగా సమర్పించడం జరుగుతున్నది.

ఇలా ఎన్నెన్నో కానుకలను మొక్కుబళ్లను స్వీకరించి వారి వారి పాపాలను, రోగాలను పోగొట్టి, వారి వారి కోరికలను తీరుస్తున్న అద్భుతమైన దేవుడు తిరుమలేశుడు.



## ఆనందకరమైన లీలలు

తిరుమలక్షేత్రం అంతటా అడుగడుగునా అణువణువునా విచిత్రాలే వింతలే! ఏది చూచినా 'న భూతో న భవిష్యతి' అన్న చందాన దానికదే సాటి అంటూ సమస్త లోకాల్లో ప్రసిద్ధికెక్కిన మహిమాన్వితమైన క్షేత్రం ఈ వేంకటాచల క్షేత్రం! ఇక ఆ క్షేత్రం మీద కొలువైవున్న వేంకటాచలపతి ఇంకెంతటివాడో! అంటే,

**కామధేనుః కల్పవృక్షః**
**చింతామణిరితి త్రయమ్**
**వేంకటేశ త్వమేవాఽసి**
**శేషాగే సర్వదానతః**

ఇష్టార్థాలను తీర్చే కల్పవృక్షంగా, కామధేనువుగా, అరచేతిలోని అద్భుతమైన చింతామణిగా – ఇలా ఈ మూడు వస్తువులుగా తానే అయి వేంకటాచలం మీద ప్రకాశిస్తూన్న దేవాదిదేవుడు తిరుమలేశుడు! కేవలం ఆ వస్తువుల మాదిరి కోరికలను తీర్చడం మాత్రమేగాక, మోక్షాన్ని కూడ, ముక్తిని కూడ ప్రసాదిస్తున్న కోటి వరాలరాయడు ఈ కొండలరాయడు! అందుకే తాళ్లపాక అన్నమాచార్యులు వేంకటేశ్వరుని వరప్రదానాన్ని భక్తవాత్సల్యాన్ని ఎలా కీర్తించాడో గమనించి ఆనందించండి మరి!

**ఏమి వలసిన ఇచ్చు నెప్పుడైనను**
**ఏమరక కొలిచిన నీతడే దైవము** ॥పల్లవి॥

**ఘనముగా నిందరికి గన్నులిచ్చు గాళ్లిచ్చు**
**పనిసేయ జేతులిచ్చు బలియుడై**
**తను గొలువుమని చిత్తములిచ్చు కరుణించి**
**వొనర లోకానకెల్ల నొక్కడే దైవము** ॥ఏమివలసిన॥

**మచ్చిక తనుగొలువ మనసిచ్చు మాటలిచ్చు**
**కుచ్చితము లేని కొడుకుల నిచ్చును**
**చొచ్చినచోటే చొచ్చి శుభమిచ్చు సుఖమిచ్చు**
**నిచ్చలు లోకానకెల్ల నిజమైన దైవము ॥ఏమివలసిన॥**

**పంతమాడి కొలిచిన ప్రాణమిచ్చు ప్రాయమిచ్చ**
**యెంతటి పదవులైన నిట్టె యిచ్చు**
**వింత విభవాల వేంకటేశుడిదె మా**
**యంతరంగమున నుండే అరచేతిదైవము ॥ఏమివలసిన॥**

ఏమరకుండా అంటే మరచిపోకుండా కొలిస్తే చాలు. కన్నులిస్తాడు! కాళ్లిస్తాడు! పని చేయ చేతులిస్తాడు! తనను కొలవడానికి మనసును ప్రేరేపించి కోరికలు తీరుస్తాడు. ఇలాంటి దేవుడు ఈ లోకంలో ఇతనొక్కడే! ఇంకెవడు లేడు కన్పట్టడు.

అలాగే మచ్చికగా కొలిస్తే, మాటనేర్పరితనం ఇస్తాడు. మూగవాణ్ణి పలికిస్తాడు. కుచ్చితములేని కొడుకులను ఇస్తాడు. మళ్లీ మళ్లీ శుభాలు ఇస్తాడు. సుఖాలు ఇస్తాడు. ఈ లోకంలో ఇలాంటి సత్యమైన నిక్కమైన దేవుడు ఇతనుగాక ఇంకొక్కడు లేడు గాక లేడు.

పంతమాడి విడువకుండా పట్టుదలతో కొలిస్తే చాలట! ప్రాణమైన ఇస్తాడు. ప్రాయమిస్తాడు. ఎంతటి పెద్ద పదవులనైనా, అధికారాన్నైనా ఇట్టె సులువుగా ఇస్తాడట! మన అరచేతి దైవంగా భాసిస్తూ వింత వింత విభవాలతో ప్రకాశిస్తున్న వేంకటేశునివంటి దైవం ఎక్కడా లేడు. లేనే లేడు – అంటూ అన్నమయ్య ఘంటాపథంగా కీర్తించాడు.

ఇలాగ అబ్బురపరచే ఆనందనిలయుని లీలలు ఒకటా! రెండా! అవి అనంతం. వాటిని తెలుసుకోవడం, తెలియపరచడం పదివేల పడగలున్న ఆదిశేషునికే సాధ్యం కాదు. మనమెంత? అయినా ఈ సంగతి వినండి మరి!



ఒకప్పుడు దారి వెంబడి వరుసగా ఐదుమంది వెళ్తున్నారు. వారిలో ఒకడు పుట్టుమూగ, రెండవవాడు పుట్టు చెవిటివాడు – వాడికి పుట్టినప్పట్నుంచీ చెవులు విన్పించవు. మూడవవాడు మొండిచేతులవాడు, నాల్గవవాడు – పుట్టుగుడ్డి – ఇక ఐదవవాడు ఆఖరివాడు కుంటివాడు – వీళ్లందరు ఒకరు చెయ్యి ఒకరు పట్టుకొని దిక్కుగానక తిరుగుతూ, గట్టిగా అరుస్తూ అందరినీ దేవులాడుతూ దీనంగా నడుస్తుండినారు. వీరి అరుపులు చాలా దీనంగా దయార్ద్రంగా వుండినాయి.

గుడ్డివాళ్లమనీ, కుంటివాళ్లమనీ, మూగవాళ్లమనీ, చెవిటివాళ్లమనీ... ఇలా కర్ణకఠోరంగా అరుస్తూ దారంబటా వెళ్తున్న వీరందర్నీ ఒక పుణ్యాత్ముడు చూచాడు.

తృణమో పణమో వారి చేతుల్లో పెడుతూ ఇలా అన్నాడు. ఒరే నాయనలారా! ఎక్కడెక్కడో దిక్కుగానక ఏ దిక్కూ లేక తిరుగుతున్నారే. ఇలా తిరిగితే మీ కష్టాలు ఎన్నటికి తీరేను? నేనొక ఉపాయం చెప్తా! శ్రద్ధగా వినండి.

అదిగో! అటు తిరగండి! ఆ వైపు తిరగండి! మీ అడుగుల్ని అటువైపు వేస్తూ నడవండి! అటువైపు ఏముందంటారా! మీమీ పాపాలన్నింటిని ధ్వంసం చేసే వేంకటాచల పర్వతం వుంది. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా, వడిగా వడివడిగా తిరువేంకటంవైపు తిరగండి! అంటూ వాళ్లకు దారి చూపించి తన దారిన తాను వెళ్లిపోయాడు సహృదయుడైన ఆ బాటసారి. వాళ్లందరూ వేంకటాచల పర్వతంవున్న వైపునకు తిరిగారు. ఒకటి రెండు అడుగులు వేశారు అంతే!

**"మూకారబ్ధం కమపి బధిరాః**
**శ్లోక మాకర్ణయంతి**
**శ్రద్ధాళుస్తం విలిఖతి కుణి**
**శ్లాఘయా వీక్షతేంధః**

అధ్యారోహత్యహహ! సహసా
పంగురప్యద్రిశృంగం
సాంద్రాలస్యా శిశుభరణతో
మందమాయాతి వంధ్యా”

**– వేంకటాధ్వరి – విశ్వగుణాదర్శం**

వారికి వేంకటాచలమ్మీది చల్లని వాయువులు సోకినయ్... వేంకటేశ్వరుని చూపు వారిపై ప్రసరించింది. ఇంకేముంది!

మూగవాడికి మాటవచ్చి శ్లోకాన్ని స్వచ్ఛంగా పలుకుతున్నాడు. ఆ శ్లోకాన్ని బధిరుడు వింటున్నాడు, మొండి చేతులవాడు ఆ శ్లోకాన్ని గుండ్రంగా రాస్తుండగా పుట్టు గుడ్డివాడు రెండు కన్నులతో చూస్తూ అద్భుతం, పరమాద్భుతం అంటున్నాడు. ఇక కుంటివాడికి కాళ్లు వచ్చాయి. చకాచకా తిరుమలకొండ ఎక్కుతున్నాడట! అంతేనా! కాదు కాదు. పుట్టుగొడ్రాలైన ఒక స్త్రీ వుందట! నీవు వంధ్యవు. నీకు పిల్లలే పుట్టరు అని ఈసడింపబడిన ఆమె ఆనందనిలయుణ్ణి వేడుకొందట! వెంటనే స్వామి అనుగ్రహించాడు.

ఆ స్వామిదయవల్ల పుత్రవతి అయ్యింది. తన చంటి పిల్లవాణ్ణి ఎత్తుకొని మురిపెంగా గోముగా ముద్దాడుతూ తిరుమల కొండను మెల్లగా మెలమెల్లగా ఎక్కుతుందట! ఎందుకట! అంటే, స్వామీ! ఏడుకొండలవాడా! నా వంధ్యాత్వం పోగొట్టి సంతానాన్ని ఇచ్చావు కదా స్వామీ! ఇదిగో వీడే నీవిచ్చిన నా బిడ్డ! అంటూ స్వామికి చూపడానికి కొండ ఎక్కుతూ వస్తుందట! అద్భుతం పరమాద్భుతం కదూ ఈ లీలలు!

అందుకే ఆ స్వామివారిని ఇలా ప్రార్థించుదాం స్వామీ! ఏడుకొండలవాడా! అడిగిన భక్తులకు అవిస్తావు, ఇవిస్తావు, అడిగిన కోరికలన్నీ ఇస్తావు అని నిన్ను పదే పదే ఎక్కువగా పొగడడం దేనికి? స్వామీ! అందువల్ల ఒకే ఒక్కమాటలో నిన్ను ప్రార్థిస్తాను.



“శ్రీనివాస! బహూక్త్యా కిం?
భక్తసర్వార్తినాశనే
సర్వార్థపూరణే చాపి
త్వత్సమోందే న కుత్రచిత్”

ఈ బ్రహ్మాండ భాండాలలో భక్తుల ఆర్తులను పోగొట్టడంలోను, సర్వార్థాలను తీర్చడంలోను నీకు సాటిరాగల దేవుడు ఎక్కడా లేడయ్యా స్వామీ! లేడు లేనే లేడు!

* * *

ఇంతవరకు ‘ఘనవేంకటేశుడు కొలువై దర్శనమిస్తున్న అద్భుతమైన కొండను గూర్చి సంక్షిప్తంగా తెలుసుకున్నాం. ఆ స్వామివారికి వున్న అనేకమైన సార్థకమైన నామాలను, ఆ పేర్ల విశిష్టతలను, వివరించుకున్నాం. ఆయన నిలిచివున్న విచిత్ర భంగిమ విశేషాల్ని, ఆ స్వామి అలంకరించుకుంటున్న దివ్యాభరణాలను గూర్చి, ఆనందనిలయుడు ఆరగించే కమ్మనైన పిండివంటలను, భక్తులు ఆ స్వామికి సమర్పించుకునే మొక్కుబళ్లను గూర్చి అద్భుతమైన లీలలను, మహిమలను గూర్చి తెలిసినంతవరకు, తెలియవచ్చినంతవరకు మనం చర్చించుకున్నాం. ప్రస్తుతం వేంకటేశ్వరుడికి జరిగే ఉత్సవాల వైభవాన్ని గూర్చి తెలుసునేముందు శ్రీ స్వామివారి పంచబేరాల (మూర్తులు)ను గూర్చి తెలుసుకుందాం.

## పంచబేరాలు

శ్రీనివాస ప్రభువు కోరినవారి కల్పతరువు! పట్టినచేతి బంగారం! ముట్టికొలిచినవారి ముందుజీతం! సేవ చేసినవారి చేతిలోని మాణిక్యం. భావించువారి పరబ్రహ్మ! కావలెనన్న వారికి మనోరథ సిద్ధినిచ్చే గురుతైన దైవం! తన్మయించి నుతించేవారి ఆనందరూపం! ఈ స్వామి ఎందరికో సంతానప్రదాత! మరెందరికో అద్భుతవైద్యుడు! ఆనందనిలయుడు ఆపద్బంధువు!

అందువల్లే భక్తులు, తమపాలిటి కొంగుబంగారమై వెలుగుతున్న శ్రీనివాసుణ్ణి కన్నులారా దర్శించడానికి నిరంతరం నిరంతరాయంగా తిరుమలయాత్ర చేస్తారు. కొందరు భక్తులు తమ తమ ఇష్టాల్ని అనుసరించి శ్రీవారి సుప్రభాతంలో పాల్గొంటారు. అర్చనలు చేయిస్తారు. నివేదనలను సమర్పిస్తారు. ఇంకొందరు నిత్యకల్యాణోత్సవంలో పాల్గొని నిత్యకల్యాణ చక్రవర్తి వైభవాన్ని తిలకిస్తారు. మరికొందరు, పూలంగిసేవను, తిరుప్పావడ సేవలో పాల్గొని పులకించిపోతారు. కొందరు శ్రీవారి శుక్రవారాభిషేకంలో పాల్గొని దర్శించి తరిస్తారు. ఇలాగ భక్తులు ప్రతినిత్యం శ్రీ వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, వసంతోత్సవాలు వంటి ఎన్నో సేవల్లో మరెన్నెన్నో ఉత్సవాల్లో పాల్గొని దర్శించి ధన్యులవుతారు. అయితే ఇక్కడ ఒక అసలు సిసలైన సందేహం భక్తులకు కలుగుతుంది. అదేమిటంటే!

అనేక ఉత్సవాల్లో సేవల్లో అనేకమంది భక్తులకు దివ్యానుభూతులను పంచుతున్న శ్రీనివాస పరంధాముని మూర్తి (విగ్రహం) అన్నిచోట్ల ఒక్కటేనా? వేరు వేరా? వేరు వేరు అయితే స్వామివారి విగ్రహమూర్తులు ఎన్ని వున్నాయి? ఏ యే మూర్తులకు ఏయే సేవలు జరుగుతాయి అన్న సందేహాలు, ప్రశ్న పరంపరలు కోకొల్లలు.

పై సందేహాలను కొంతవరకైనా తీర్చుకొన్న తర్వాతే అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని ఉత్సవవిశేషాలను గూర్చి చర్చించుకుందాం.

తిరుమల పుణ్యక్షేత్రంలో స్వయంవ్యక్తమై వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి అనాదిగా అత్యంత ప్రాచీనమైన వైఖానసాగమం ప్రకారం పూజానివేదనలు జరుగుతున్నాయి. భక్తులు తమకు వర్తించుకొనే కొన్ని కార్యక్రమాలను పురుషోత్తముడైన భగవంతునికి కూడా ఆపాదించి సేవించకోవడం కద్దు. ఆవిధంగా ఉపాసించడం భక్తులకు సులువైన మార్గం కూడ! కనుకనే భక్తులు



స్నానం (అభిషేకం) అర్చనం (పూజ) భోజనం (నైవేద్యం) యాత్ర (ఊరేగింపు) శయనం (పాన్పుసేవ) మున్నగు సేవలు భగవంతునికి నిర్వహిస్తారు. భక్తులు చేసే ఈ పనులన్నింటికి ఆలయంలోని మూలమూర్తి (మూలవిగ్రహం) కదలకుండా స్థిరంగా వుంటుంది కనుక ఊరేగింపు, శయనం, మున్నగు కార్యక్రమాలకు అనువుగా ఉండదు. అందువల్ల ఆగమశాస్త్రాలు పై ఉత్సవ కార్యక్రమాలన్నింటికి వీలుగా (1) ధ్రువబేరం (2) కౌతుకబేరం (3) స్నపనబేరం (4) బలిబేరం (5) ఉత్సవబేరం అను ఐదు మూర్తులను అనుమతించింది. బేరం అనగా విగ్రహం లేదా 'మూర్తి' అని అర్థం.

తిరుమల క్షేత్రంలో కూడా శ్రీనివాసుని అర్చించటానికి వీలుగా వైఖానసాగమం పై ఐదుమూర్తులను ప్రవేశపెట్టింది. తిరుమలలో కొన్ని మూలమూర్తులకు, కొన్ని ఉత్సవమూర్తులకు సేవలు, ఉత్సవాలు జరుగుతాయి.

### 1. ధ్రువబేరం

మూలవిరాట్టు, ధ్రువమూర్తి, మూలబేరం అని ఈ మూర్తికి వున్న పేర్లు. ఆనందనిలయంలోని గర్భాలయంలో స్వయంభువుగా శంఖచక్రాలతో వెలసిన సాలగ్రామ శిలామూర్తి. ఈ విగ్రహం ఎత్తు సుమారు 8 అడుగులు ఉంటుందని అంచనా. ప్రధానంగా మూలవిరాణ్మూర్తికి ప్రతిరోజు రెండుమార్లు తోమాలసేవ, మూడుమార్లు అర్చనలు, నైవేద్యాలు, జరుగుతాయి. ప్రతిరోజు భక్తులు క్యూలో వెళ్లి దర్శించేమూర్తి ఈ మూలవిరాట్టు. వక్షఃస్థల మహాలక్ష్మితో కూడివున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి మూలమూర్తికి ప్రతి మంగళవారం రెండవ అర్చనగా 108 బంగారు కమలాలతో అష్టదళ పాదపద్మారాధన అనే పుష్పార్చన జరుగుతుంది. ప్రతి గురువారం ఉదయం 'తిరుప్పావడ' సేవ, నేత్రదర్శనం, సాయంత్రం పూలంగిసేవ నిర్వహింపబడతాయి. ప్రతి శుక్రవారం తెల్లవారు జామున సుగంధ ద్రవ్యాలతో ఈ మూలమూర్తికి అభిషేకం జరుగుతుంది.

## 2. కౌతుకబేరం

'భోగ శ్రీనివాసమూర్తి' మనవాళప్పెరుమాళ్, అని ఈ మూర్తికి పేర్లు, శంఖ చక్రధారియై చతుర్భుజుడైన ఈ భోగమూర్తి అన్నివిధాలా మూలవిరాట్టునకు చిన్న ప్రతిరూపం. 1½ అడుగుల ఎత్తువున్న ఈ వెండి విగ్రహాన్ని 614లో పల్లవరాణి సామవై బహూకరించిందట. ఎల్లప్పుడు శ్రీ స్వామివారి మూలమూర్తి పాదాల ముందరవున్న ఈ భోగశ్రీనివాసమూర్తికి ప్రతిరోజు ఉదయం ఆకాశగంగ తీర్థంతో అభిషేకం, ప్రతి బుధవారం ఉదయం బంగారు వాకిలిముందు సహస్రకలశాభిషేకం, ప్రతిరోజు రాత్రి ఏకాంతసేవ అనగా పవళింపుసేవ జరుగుతాయి. కాని ధనుర్మాసం ఒక్క నెలరోజులపాటు మాత్రం ఈ భోగ శ్రీనివాసమూర్తికి బదులుగా వెన్నముద్ద కృష్ణుని వెండి విగ్రహానికి ఏకాంతసేవ జరుగుతుంది.

## 3. బలిబేరం

కొలువు శ్రీనివాసమూర్తి, లేఖన శ్రీనివాసమూర్తి అని ఈ బలిబేరమూర్తికి పేర్లు. వెండి భోగ శ్రీనివాసమూర్తివలె వున్న పంచలోహమూర్తి విగ్రహం ఇది.

ప్రతిరోజు ఆలయంలో తోమాలసేవ అయిన తర్వాత అర్చనకంటె ముందుగా స్నపన మండపంలో బంగారు సింహాసనంలో కొలువు జరుగుతుంది. ఈ కొలువులో కొలువు శ్రీనివాసమూర్తికి ఛత్రచామర మర్యాదపూర్వకంగా సార్వభౌమోచిత సత్కారాలతో ఆస్థానం జరుగుతుంది. ఆ కొలువులో ఆనాటి తిథివార నక్షత్రాదులతో పంచాంగ శ్రవణం, ముందునాటి ఆదాయ వ్యయాలతోపాటు మొత్తం రాబడులను స్వామికి విన్పించడం జరుగుతుంది. దేవస్థానం మొత్తం ఆదాయవ్యయాల వంటి లెక్కలను పర్యవేక్షించే అధికారమూర్తి కొలువు శ్రీనివాసమూర్తి!



## 4. స్నపనబేరం

ఉగ్రశ్రీనివాసమూర్తి, వేంకటత్తురైవార్, స్నపనమూర్తి అని ఈ స్వామికి పేర్లు. శ్రీదేవి భూదేవి సహితుడైన ఉగ్రశ్రీనివాసుని పంచలోహ విగ్రహాలు పూర్వం ఉత్సవాదులలో పాల్గొనేవి.

14వ శతాబ్దంలో ఒకానొక బ్రహ్మోత్సవంలో కొన్ని విపరీతమైన సంఘటనలు జరిగినందువల్ల ఉగ్ర శ్రీనివాసమూర్తి విగ్రహాల ఊరేగింపును పూర్తిగా ఆపివేశారు.

అయినా సంవత్సరంలో కేవలం కైశిక ద్వాదశినాడు అనగా కార్తికమాసంలో తెల్లవారుజామున మాత్రమే ఈ ఉగ్ర శ్రీనివాసమూర్తి ఊరేగింపుగా బయటకువచ్చి సూర్యోదయానికంటె చాలాముందుగా ఆలయంలోకి వెళతాడు. శ్రీదేవి భూదేవి సమేతంగావున్న శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తి విగ్రహం ఎత్తు సుమారు 25 అంగుళాలు.

## 5. ఉత్సవ బేరం

మలయప్పస్వామి, ఉత్సవ శ్రీనివాసమూర్తి అని పేర్లు.

క్రీ.శ. 1339లో ఈ మూర్తుల ప్రస్తావన కనపడుతున్నది. ఆలయం బయట కల్యాణోత్సవం, బ్రహ్మోత్సవం మున్నగు అన్ని నిత్యోత్సవ, వారోత్సవ, మాసోత్సవ, వార్షికోత్సవాల్లో భక్తులకు దర్శనమిచ్చేమూర్తి శ్రీమలయప్పస్వామి. ఉగ్రశ్రీనివాసమూర్తి తర్వాత ఉత్సవాదులలో శ్రీదేవి భూదేవి సమేతంగా పాల్గొనే శ్రీ మలయప్పస్వామివారి పంచలోహ విగ్రహాల ఎత్తు సుమారు 30 అంగుళాలు 'మలయప్పకోన'లో లభ్యమయినందువల్ల ఈ మూర్తికి 'మలయప్పస్వామి' అనే పేరు ఏర్పడింది.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఈ పంచమూర్తులేగాక ఆనందనిలయంలో ఇంకా

1) శ్రీ సుదర్శన చక్రత్తాళ్వారు 2) శ్రీ సీతారామ లక్ష్మణులు 3) శ్రీ రుక్మిణీశ్రీకృష్ణులు 4) శ్రీ వేంకటేశ్వరస్వామివారి పరివారమైన అ) అనంతుడు ఆ) విష్వక్సేనుడు ఇ) గరుత్మంతుడు 5) శ్రీరాముని పరివారమైన i) సుగ్రీవుడు ii) అంగదుడు iii) ఆజ్ఞాపాలక ఆంజనేయస్వామి మున్నగు మూర్తులు కూడా వున్నాయి. ఈ మూర్తులకు కూడ కొన్ని ఉత్సవాలు, సేవలు జరుగుతున్నాయి.

ఇలాగ తిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి మూలమూర్తితోపాటు కొలువైవున్న పై మూర్తులన్నింటికి ఆ యా విశేష దినాల్లో ఆ యా మూర్తులకు ఉత్సవాలు, సేవలు ఘనంగా నిర్వహింపబడుతున్నాయి. ప్రస్తుతం ఇలా ఏడాది పొడవునా నిర్వహింపబడే ఉత్సవాలను గూర్చి తెలుసుకుందాం.

## సందడిగా సాగే ఉత్సవాలు

తిరుమల శ్రీనివాసస్వామివారికి ఏడాది పొడవునా జరుగుతున్న 1) నిత్యోత్సవాలు 2) వారోత్సవాలు 3) మాసోత్సవాలు 4) వార్షికోత్సవాలు లేదా సంవత్సరోత్సవాలు ఇలా నాలుగు విధాలుగా వింగడించుకొని సంక్షిప్తంగా వాటిని గూర్చి తెలుసుకుందాం.

## నిత్యోత్సవాలు

తిరుమలలో ప్రతిరోజు తెల్లవారుజామున సుప్రభాతం మొదలు రాత్రి ఏకాంతసేవ వరకు శ్రీస్వామివారికి ఎన్నో సేవలు, ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇలా ఒకరోజులో జరిగేవాటిని 'నిత్యోత్సవాలు' అంటారు. వాటిగురించి సంగ్రహంగా తెలుసుకుందాం.

### 1. సుప్రభాతం

తిరుమలలో శ్రీస్వామివారికి జరిగే తొలిసేవ సుప్రభాతం. శయన మండపంలో పట్టుపానుపుపై శయనించివున్న శ్రీనివాసప్రభువును మేల్కొల్పడమే సుప్రభాతం అంటారు.



ప్రతిరోజు తెల్లవారుజామున బంగారువాకిలి ముందు ఆచార్య పురుషులు "కౌసల్యా సుప్రజారామ..." అంటూ సుప్రభాత శ్లోకాలను పఠిస్తూ వుండగా అదేసమయంలో తాళ్లపాక అన్నమయ్య వంశీయులు ఒకరు "మేలుకో శృంగార రాయ..." అంటూ మేల్కొల్పులు పాడతారు.

ఈ సమయంలో అర్చకులు, జియ్యంగారులు, ఆలయ అధికారులు సుప్రభాత సేవకు ఆర్జితం చెల్లించిన భక్తులు ఇలా అందరూ బంగారు వాకిలిముందు చేరి ఎప్పుడెప్పుడు బంగారు వాకిళ్లు తెరుస్తారా అని నిరీక్షిస్తుంటారు.

బంగారువాకిలి ముందు ఆచార్యులు సుప్రభాత స్తవాన్ని పూర్తిచేయగా, బంగారు వాకిళ్లు తెరుస్తారు. అందరూ ఒకరితర్వాత ఒకరుగా వెళ్లి స్వామివారిని దర్శిస్తూ హారతి, తీర్థశతాల్ని స్వీకరిస్తారు. చివరగా ఆర్జితం చెల్లించిన భక్తులు కూడ వెళ్లి శ్రీస్వామివారిని దర్శిస్తారు. సుప్రభాతసేవలో కలిగే శ్రీవారి ఆపాదమస్తక దర్శనాన్ని "విశ్వరూప సందర్శనం" అంటారు. ఈ దర్శనంలో కలిగే శ్రీస్వామివారి పాదదర్శనం చేస్తే చాలు పాపాలు పోతాయి. అందువల్లే "పాదదర్శనం పాపవిమోచనం" అన్న ప్రసిద్ధి కలిగింది.

### 2. తోమాల సేవ

తిరుమల ఆనందనిలయంలో శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలవిరాట్టుకు ఉత్సవమూర్తులకు... ఇంకా ఇతర విగ్రహాలకు పుష్పమాలలతోను, తులసి మాలలతోను అలంకరించే కార్యక్రమాన్నే 'తోమాలసేవ' అంటారు. భుజాల మీదినుంచి వేలాడేట్లుగా అలంకరించే శ్రీవారి పుష్పాలంకరణ విధానాన్ని "తోళ్‌మాలై" అంటారు. అదే "తోమాల"గా మారిందంటారు. తోళ్ అనగా భుజమని అర్థం.

ఆర్జితం చెల్లించిన భక్తులు కూడ ఈ సేవలో పాల్గొని దర్శించవచ్చు. అయితే సాయంత్రం పూట జరిగే తోమాలసేవ మాత్రం ఏకాంతంగా జరుగుతుంది. ఎవ్వరూ పాల్గొన వీలులేదు.

ఏకాంగి కాని లేదా జియ్యంగారులు పూల అరనుంచి సిద్ధంచేసిన పూలమాలలను తీసికొనివచ్చి అర్చకులకు అందిస్తూ వుండగా అర్చకులు శ్రీవారి నిలువెత్తు విగ్రహానికి పూలమాలల్ని అలంకరిస్తారు. ఈ సేవ సుమారు అర గంటసేపు జరుగుతుంది.

## 3. కొలువు

తోమాలసేవ అనంతరం ప్రతిరోజు బంగారు వాకిలి లోపలవున్న స్నపన మండపంలో బంగారు సింహాసనంపై కొలువు శ్రీనివాసమూర్తికి కొలువు జరుగుతుంది. ఆ సమయంలో ఆనాటి తిథివార నక్షత్రాది వివరాలతో పంచాంగ శ్రవణం జరిగిన తర్వాత ముందునాటి హుండీ ఆదాయవ్యయాలు, అన్నదాతల పేర్లు అన్నీ శ్రీస్వామివారికి విన్పించబడతాయి. పిదప కొలువు శ్రీనివాసమూర్తికి బెల్లం కలిపిన నువ్వుల పిండి నివేదింపబడుతుంది.

బ్రహ్మోత్సవంలో తొలిరోజు ధ్వజారోహణ జరిగేరోజు మాత్రము ఈ 'కొలువు' బంగారువాకిలిముందర జరుగుతుంది.

ప్రతిరోజు 'కొలువు'లో శ్రీనివాసుడు అర్చకులకు 'తండులదానం' చేస్తాడు. అనగా బియ్యం, తాంబూలం, దక్షిణతో కూడిన బియ్యాన్ని దానం చేస్తాడు. అప్పుడు అర్చకస్వాములు "నిత్యైశ్వర్యో భవ" అని శ్రీనివాసుణ్ణి ఆశీర్వదిస్తారు.

ఈ కొలువు పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది.

## 4. సహస్రనామార్చన

శ్రీ వేంకటేశ్వరస్వామివారి మూలవిరాట్టునకు ప్రతిరోజు ఉదయం తోమాలసేవ అనంతరం సహస్రనామార్చన జరుగుతుంది.



జియ్యంగారులు అందించిన తులసిని స్వీకరించి అర్చనలు శ్రీవేంకటేశ్వర సహస్రనామావళితో శ్రీవారిపాదాలను అర్చన చేస్తారు. పిదప అర్చకులు శ్రీవారి పాదాలమీది తులసిని స్వీకరించి శ్రీవారి వక్షఃస్థలంమీది శ్రీ మహాలక్ష్మీ అమ్మవారిని మహాలక్ష్మీ చతుర్వింశతి (24) నామాలతో అర్చిస్తారు. ప్రతి ఉదయం సుమారు అర గంటపాటు జరిగే సేవలో భక్తులు ఆర్జితం చెల్లించి పాల్గొనవచ్చు.

ఇదిగాక ప్రతిరోజు శ్రీస్వామివారికి రెండవ మూడవ అర్చనలుగా మరి రెండుమారులు అష్టోత్తర శత నామాలతో మాత్రమే అర్చన జరుగుతుంది. ఈ అర్చనలు ఏకాంతంగా జరుగుతవి. కాని మంగళవారంనాడు రెండవ అర్చనగా జరిగే "అష్టదళపాద పద్మారాధన"లో మాత్రమే ఆర్జితం చెల్లించి భక్తులు పాల్గొనవచ్చు.

## 5. నివేదన

ప్రతిరోజు ఉదయం సహస్రనామార్చన జరిగిన వెంటనే గర్భాలయంలో శ్రీస్వామివారికి ఇతర మూర్తులకు నివేదన జరుగుతుంది. లడ్డూలు, వడలు, దధ్యోదనం, పులిహోర, పొంగళ్లు... వగైరా ప్రసాదాలు నివేదించబడతవి. తొలి నివేదనను మొదటి గంట అంటారు.

మధ్యాహ్నం జరిగే నివేదనను – రెండవ గంట అంటారు.

రాత్రి జరిగే నివేదనను – మూడవ గంట లేదా రాత్రి గంట అంటారు.

ఇక రాత్రి ఏకాంతసేవకుముందు 'తిరువీసం' గంట అనే చక్కెర పొంగలి ప్రసాదం శ్రీస్వామివారికి నివేదిస్తారు. తర్వాత దానిని సన్నిధి భాష్యకారులకు నివేదించడం జరుగుతుంది. ఈ నివేదనలన్నీ ఏకాంతంగా అర్చకులు మాత్రమే నిర్వహిస్తారు.

## 6. శాత్తుమొర

శ్రీస్వామివారికి నివేదించిన దధ్యోదనం, చక్కెరపొంగలి ప్రసాదాలు రామానుజులవారికి మళ్లీ నివేదిస్తారు. పిదప వైష్ణచార్య పురుషులు శ్రీస్వామివారి సన్నిధిలో దివ్యప్రబంధపారాయణం చేస్తారు. దీన్నే శాత్తుమొర అంటారు. పిదప ఈ వైష్ణవాచార్యులందరు రామానుజులకు నివేదన అయిన ప్రసాదాన్ని స్వీకరిస్తారు.

## 7. కల్యాణోత్సవం

శ్రీవారి ఆలయం సంపంగి ప్రదక్షిణంలోవున్న శ్రీవేంకటరమణస్వామి కల్యాణ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారికి ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటలకు "కల్యాణోత్సవం" జరుగుతుంది.

భక్తులు నిర్ణీత ఆర్జిత రుసుమును చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు.

ప్రత్యేక ఉత్సవ సమయాల్లో, విశేష సమయాల్లో జరిగే ఈ కల్యాణోత్సవాన్ని 15వ శతాబ్దంలో నిత్యకల్యాణోత్సవంగా నిర్వహించి ఏర్పాటు చేసినవారు తాళ్లపాక అన్నమాచార్యులవారు. కనుకనే నేటికీ జరిగే ఈ కల్యాణోత్సవంలో తాళ్లపాక వంశీయులు కన్యాదాతలుగా పాల్గొంటూ సత్కారాన్ని పొందుతూనే ఉన్నారు.

బ్రహ్మోత్సవం, పుష్పయాగం, పవిత్రోత్సవం వంటి విశేషోత్సవ సమయాల్లో తప్ప, మిగిలిన అన్నిరోజుల్లో విధిగా శ్రీవారికి నిత్యకల్యాణోత్సవం జరుపబడుతుంది.

కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలు ఇవ్వబడతవి.



## 8. డోలోత్సవం (అద్దాల మండపం)

ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆర్జితంగా నిర్ణీత రుసుమును చెల్లించిన భక్తుల కోరిక మేరకు దేవేరులతో శ్రీ మలయప్ప స్వామివారికి అద్దాల మండపంలో డోలోత్సవం జరుగుతుంది.

ఆర్జితం చెల్లించిన భక్తుల కొరకు మాత్రమే ఈ సేవ జరుపబడుతుంది. లేనిచో ఈ సేవ జరుపబడదు.

## 9. ఆర్జిత బ్రహ్మోత్సవం

ఆర్జిత రుసుమును చెల్లించిన భక్తుల కోరికమేరకు ఆలయం ముందరవున్న వైభవ మండపంలో శ్రీదేవీ భూదేవీ సమేతంగా శ్రీ మలయప్పస్వామికి ఆర్జిత బ్రహ్మోత్సవం జరుపబడుతుంది. ముఖ్యంగా పెద్దశేషవాహనం, గరుడవాహనం, హనుమంతవాహనం – మాత్రమే ఆర్జిత బ్రహ్మోత్సవంలో సంక్షిప్తంగా నిర్వహిస్తారు.

కల్యాణోత్సవానంతరం మాత్రమే ఆర్జిత భక్తుల కోరిక మేరకు మాత్రమే ఈ బ్రహ్మోత్సవం జరుగుతుంది.

## 10. వాహనసేవలు

భక్తులు తమ ఇష్టానుసారం శ్రీవేంకటేశ్వరునికి ఆ యా రోజుల్లో వాహన సేవలు చేయించవచ్చు. ఇవి కూడ ఆర్జిత భక్తుల కోరికమేరకు మాత్రమే జరుపబడతవి. ప్రధానంగా గరుడవాహనం, హనుమంత వాహనం, పెద్దశేషవాహనం... వంటి సేవలు ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటలకు ఆలయం ముందరవున్న వైభవమండపంలో నిర్వహింపబడతవి.

## 11. ఆర్జిత వసంతోత్సవం

నిర్ణీత రుసుమును చెల్లించిన భక్తులకోసం మాత్రమే ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆలయం ముందరి భాగంలోవున్న వైభవమండపంలో

ఆర్జిత వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు. శ్రీదేవి భూదేవులతో కూడిన శ్రీ మలయప్పస్వామికి ఈ వసంతోత్సవం జరుగుతుంది.

## 12. సహస్ర దీపాలంకరణ సేవ

ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు శ్రీవారి ఆలయం వెలుపల ఆగ్నేయమూలలోవున్న కొలువు మండపంలో "సహస్రదీపాలంకరణ సేవ" అనబడే "ఊంజల్‌సేవ" జరుపబడుతుంది.

శ్రీదేవి భూదేవులతో కూడిన మలయప్పస్వామి ఊరేగింపుగా వచ్చి సహస్ర దీపాలు వెలిగించిన ఈ మండపంలో ఊంజల్‌సేవలో పాల్గొంటారు. ఆర్జితం చెల్లించిన భక్తులు కూడా ఈ సేవలో పాల్గొనవచ్చు. ఆర్జిత భక్తులు లేకపోయినా ప్రతి సాయంత్రం విధిగా జరిగే సేవ ఇది. 'సహస్ర దీపాలంకరణ' సేవ అనంతరం మహాప్రదక్షిణ మార్గంలో శ్రీస్వామివారల ఊరేగింపు జరుగుతుంది. కాని ప్రతినెలా రోహిణి నక్షత్రంనాడు రుక్మిణీశ్రీకృష్ణులకు, పునర్వసునాడు శ్రీ సీతారామలక్ష్మణ స్వామివారలకు సహస్ర దీపాలంకరణ సేవ జరుగుతుంది. ఆరుద్ర నక్షత్రం రోజున శ్రీ మలయప్పస్వామితోపాటు ఎదురుగా మరొక పల్లకిపై శ్రీరామానుజులవారి విగ్రహం ఊరేగింపబడుతుంది.

## 13. ఏకాంతసేవ

'ఏకాంతసేవ'కే 'పాన్పుసేవ' 'పవ్వళింపు సేవ' అనికూడ అంటారు. తిరుమల శ్రీవారి ఆలయంలో రోజువారీ కార్యక్రమాల్లో ప్రధానమైన చివరిసేవ ఏకాంతసేవ. ఏకాంతసేవకు వేళ కాగానే సర్వదర్శనం నిలిపివేయబడుతుంది.

శయన మండపంలో వెండి గొలుసులతో వేలాడదీయబడిన బంగారు పట్టెమంచంపై భోగశ్రీనివాసమూర్తిని వేంచేపు చేస్తారు.



రాములవారి నడవలో తాళ్లపాక వంశీయులు ఒకరు జోలపాట లేదా లాలిపాట గానం చేయడానికి సిద్ధంగా వుంటారు. అదే సమయంలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబవారి తరపున హారతిపళ్లెం వస్తుంది.

ఆర్జితం చెల్లించిన భక్తులు బారులుగా కూర్చొని చూస్తూండగా అన్నమయ్య వంశీయులు "జో అచ్యుతానంత జోజో ముకుందా...!" అని పాటపాడుతూ వుండగా తరిగొండ వెంగమాంబ ముత్యాలహారతి జరుగుతుంది. ఇలా దర్శించిన భక్తులకు శ్రీస్వామివారికి నివేదించిన గోరువెచ్చని పాలను అనేక పండ్లతో తయారు చేసిన 'మేవా' అనబడే పంచామృత ప్రసాదాన్ని ఇస్తారు. దీని తర్వాత బంగారువాకిళ్లు మూసివేస్తారు.

## వారోత్సవాలు

శ్రీ వేంకటేశ్వరస్వామివారికి వారానికి ఒకమారుమాత్రమే తప్పనిసరిగా జరిగే వారోత్సవాలు కొన్ని ఉన్నాయి. ఇలా ఆ యా వారాల్లో జరిగే ఆ యా సేవలను గూర్చి తెలుసుకుందాం.

## 1. సోమవారం - విశేష పూజ

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి ప్రతిసోమవారం ఉదయం 6 గంటలకు జరిగే ప్రధానసేవ "విశేష పూజ". ఈ సేవ సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణ మండపంలో శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్పస్వామి వారికి జరుగుతుంది.

ప్రతి సోమవారం జరిగే ఈ సేవ 1991 ఏప్రిల్ 8న ప్రారంభింపబడి ఆర్జితసేవగా కూడ రూపుదిద్దుకుంది.

శ్రీవారి ఆలయంలో రెండవ అర్చన రెండవ నైవేద్యం అయిన తర్వాత దేవేరులతోకూడిన శ్రీ మలయప్పస్వామి కల్యాణమండపానికి వేంచేస్తారు.

వైఖానసాగమ శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించిన పిదప శ్రీస్వామివారలకు (స్నపన) తిరుమంజనం నిర్వహిస్తారు.

ఈ సేవలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు ఇవ్వబడతవి.

## 2. అష్టదళపాదపద్మారాధన

ప్రతి మంగళవారం ఉదయం 6 గంటలకు రెండవ అర్చనగా 108 బంగారు కమలాలతో మూలవిరాట్టునకు జరిగే అర్చనా కార్యక్రమమే "అష్టదళపాదపద్మారాధన". ఇది సుమారు 20 నిమిషాలపాటు జరుగుతుంది.

1984వ సంవత్సరంలో తి.తి.దేవస్థానం స్వర్ణోత్సవ సందర్భంగా ప్రవేశపెట్టబడిన సేవ ఇది. హైదరాబాదు వాస్తవ్యుడు ఒక మహమ్మదీయ భక్తుడు ఇందుకు అవసరమైన 108 బంగారు పద్మాలను కానుకగా సమర్పించాడు. తర్వాత ఇది ఆర్జితసేవగా కూడ రూపుదిద్దుకొంది.

108 బంగారు కమలాలతో అష్టోత్తర శత నామాలతో అర్చన జరుగుతుండగా భక్తులు నయనానందకరంగా శ్రీస్వామివారి మూలమూర్తిని కనులపండువుగా దర్శించవచ్చు.

## 3. బుధవారం - సహస్రకలశాభిషేకం

ప్రతి బుధవారం ఉదయం తిరుమలలో బంగారువాకిలి ముందు జరిగే ప్రధానసేవ "సహస్ర కలశాభిషేకం". భోగ శ్రీనివాసమూర్తితో పాటు, శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్పస్వామివారికి సేనాధిపతికి విష్వక్సేనులవారికి ఈ సహస్రకలశాభిషేకం జరుగుతుంది.

క్రీ.శ.1511 నాటికి ముందునుండి ఈ సహస్రకలశాభిషేకం జరుగుతున్నట్లు దాఖలాలున్నాయి.



బంగారువాకిలి ముందు జరిగే ఈ సహస్ర కలశాభిషేకంలో ఆర్జిత రుసుమును చెల్లించిన భక్తులు మాత్రమే పాల్గొని దర్శించవచ్చు. వీరికి శ్రీవారి దర్శనం కల్గించి ప్రసాదాలు అందజేయబడతవి. ఈ దర్శనంతో సహస్రవిధాలుగా చుట్టుకొన్న పాపాలన్నీ పటాపంచలవుతాయి.

## 4. గురువారం - తిరుప్పావడ సేవ

### నేత్రదర్శనం

ప్రతి గురువారం శ్రీ వేంకటేశ్వరస్వామివారికి రెండవ అర్చనానంతరం జరిగే నివేదనే "తిరుప్పావడసేవ" అనీ "అన్నకూటోత్సవ"మనీ అంటారు.

గురువారం ఉదయం 6 గంటలకు శ్రీస్వామివారి మూలవిరాట్టుకు ఉన్న ఆభరణాలను అన్నిటినీ తీసివేస్తారు. పిదప నొసటి మీద ఉన్న నామాన్ని కూడా బాగా తగ్గించి నేత్రాలు స్పష్టంగా కనపడేట్లు చేస్తారు. పిదప శ్రీస్వామివారికి ఎదురుగా బంగారువాకిలి ముందర పెద్దశిఖరంలాగా పులిహోరరాశిని ఏర్పాటు చేస్తారు. పులిహోరతోపాటు జిలేబీలను, మురుకులను చక్కగా అమర్చి పూలతో అలంకరిస్తారు. పిదప ఈ పులిహోరరాశిని నేరుగా గర్భాలయంలోని స్వామివారికి నివేదిస్తారు.

ఈ సేవలో ఆర్జితం చెల్లించిన భక్తులు మాత్రమే పాల్గొనవచ్చు. ఈ సేవలో వేదపండితులు వేదపారాయణంతోపాటు శ్రీనివాసగద్యను పఠిస్తారు.

తర్వాత భక్తులందరికీ తిరుప్పావడసేవతోపాటు శ్రీవారి నేత్రదర్శనం పొందే అవకాశం కలుగుతుంది.

ఈ సేవ చేయించినవారికి, వారు చేసిన అన్నగత దోషాలు తొలగడమేగాక, వారికి వంశపారంపర్యంగా అన్నసమృద్ధి కలుగుతుంది.

## 5. పూలంగిసేవ

ప్రతి గురువారం సాయంత్రం శ్రీవారికి జరిగే తోమాలసేవను "పూలంగిసేవ" అంటారు. అయితే ఈ సేవ మాత్రం పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది. జియ్యంగారులు అందించే పూలమాలలతో అర్చకులు శ్రీవారి విగ్రహమూర్తిని ఆపాదమస్తకం అలంకరిస్తారు. శ్రీస్వామివారు పూల అంగీని తొడిగినట్లుగా వుంటారు. పూలంగిసేవ అలంకరణ అయిన తర్వాత ప్రతి గురువారం రాత్రి యాత్రికులు పూలంగి అలంకరణలో వున్న శ్రీస్వామివారిని నయనానందంగా దర్శించి పులకించిపోతారు. సువాసనలు వెదజల్లే పూలంగిసేవలోవున్న స్వామివారిని దర్శించినట్లైతే అనేక జన్మల్లో చేసిన పాపాలు, ఆ జన్మాంతర వాసనలన్నీ ఇట్టే నశిస్తాయి.

## 6. శుక్రవారాభిషేకం

శ్రీ వేంకటేశ్వరస్వామివారి మూలమూర్తికి ప్రతి శుక్రవారం తెల్లవారు జామున 5 గంటలకు జరిగే అభిషేకమే శుక్రవారాభిషేకం.

ప్రతి శుక్రవారం విశేషోత్సవంగా జరుపబడే ఈ అభిషేకం క్రీ.శ. 614 నుండే జరిగేదని తెలుస్తున్నది.

విశేష సందర్భాల్లో జరిగే ఈ శుక్రవారాభిషేకాన్ని, భగవద్రామానుజుల వారు శ్రీస్వామివారి వక్షఃస్థలంలో "బంగారు అలమేలుమంగ" ప్రతిమను అలంకరింపజేసిన శుక్రవారం మొదలుగా ఆనాటినుండి ప్రతి శుక్రవారంనాడు అభిషేకం జరిగేట్లు ఏర్పాటు చేశారట.

పునుగు, కస్తూరి, జవ్వాది మున్నగు సుగంధ పరిమళ ద్రవ్యాలతో ఆకాశగంగా తీర్థంతో సుమారు ఒక గంటపాటు అభిషేకం జరుగుతుంది. ఆ తర్వాత పసుపుతో శ్రీవారి వక్షఃస్థలమ్మీది మహాలక్ష్మికి కూడ అభిషేకం జరుగుతుంది.



ఎప్పుడో ఏనాడో బ్రహ్మాది దేవతల కోరికమేరకు కలియుగ మానవులకోసం వెలసిన శ్రీనివాసుని యథాతథమైన రూపాన్ని వక్షఃస్థల లక్ష్మితో కూడ ఈ శుక్రవారాభిషేక సమయంలో మాత్రమే దర్శించ వీలవుతుంది.

అభిషేకం అయిన తర్వాత శ్రీస్వామివారిమెడలోవున్న బంగారు అలమేలుమంగకు కూడ అభిషేకం జరుగుతుంది.

ఆర్జితసేవగా జరుపబడుతున్న ఈ అభిషేకోత్సవం భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నది.

అభిషేకానంతరం భక్తులందరిమీదా అభిషేకతీర్థాన్ని సంప్రోక్షించడంతో అభిషేకదర్శనం ముగుస్తుంది. శ్రీవారి శుక్రవారాభిషేక దర్శనంతో భక్తుల పాపాలన్నీ కడిగివేసినట్లుగా శుభ్రంగా తొలగడమేగాక, ఆరోగ్యం, ఐశ్వర్య, సంపదలు సమృద్ధిగా కలుగుతాయి.

## 7. నిజపాద దర్శనం

ప్రతి శుక్రవారం అభిషేకానంతరం అభిషేక సేవలో పాల్గొన్న గృహస్థులు శ్రీస్వామివారిని దర్శించి వెళ్లిన తర్వాత 'నిజపాద దర్శనం' ప్రారంభమవుతుంది.

ఆర్జిత రుసుమును చెల్లించిన భక్తులు ఈ సేవలో పాల్గొని శ్రీ వేంకటేశ్వరస్వామివారి నిజపాదాలను అంటే ఎలాంటి తొడుగులు లేకుండా నిజపాదాలను దర్శించవచ్చు. ఈ దర్శనంలో మాత్రమే శ్రీవారి నిజపాదాలు దర్శించుటకు వీలుపడుతుంది. మిగిలిన వేళల్లో ఆ పాదాలు బంగారు తొడుగులతో విరాజిల్లుతూ ఉంటాయి. శ్రీవారి "పాదదర్శనం"తో పాపవిమోచనం అవుతుందని పురాణ ప్రశస్తి! అందుకే "పాదదర్శనం పాపవిమోచనం" అన్న ప్రసిద్ధి ఏర్పడింది.

## పక్షోత్సవాలు

తిరుమల శ్రీవారికి ప్రతి ఏకాదశినాడు పక్షోత్సవం జరుగుతుంది. అయితే ఆనాడు విశేషంగా ఉత్సవాలు ఊరేగింపులు లేకపోయినా నివేదనలలో మాత్రం అన్నప్రసాదాలు తగ్గింపబడి, శ్రీస్వామివారికి ప్రత్యేకంగా దోసెలు, సుండలు (గుగ్గిళ్లు) నివేదింపబడతాయి.

## మాసోత్సవాలు (నక్షత్రోత్సవాలు)

తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రతినెలా ఆ యా నక్షత్ర దినాల్లో విశేషంగా కొన్ని ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇవి నెలకు ఒక్కమారే వస్తాయి కనుక వీటిని మాసోత్సవాలని కూడా అంటారు.

### 1. రోహిణి నక్షత్రోత్సవం

ప్రతినెలా శ్రీకృష్ణుని జన్మ నక్షత్రమైన రోహిణి నాటి ఉదయం సుప్రభాతానంతరం భోగ శ్రీనివాసమూర్తితోపాటు రుక్మిణీ శ్రీకృష్ణులకు అభిషేకం జరుగుతుంది.

ఆ సాయంత్రం రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామి ఆలయం వెలుపలికి వచ్చి కొలువు మండపంలో జరిగే సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొంటారు. పిదప మహాప్రదక్షిణ మార్గంలో రుక్మిణీ శ్రీకృష్ణులకు ఊరేగింపు జరిగిన తర్వాత ఆలయంలో ప్రవేశిస్తారు. ఈ సేవలో దర్శించిన వారందరికి అనగా 27 నక్షత్రాలవారికి నక్షత్రశాంతితోపాటు ముఖ్యంగా రోహిణి నక్షత్రశాంతి విశేషంగా జరుగుతుంది.

### 2. ఆర్ద్ర నక్షత్రోత్సవం

శ్రీభగవద్రామానుజులవారి అవతార నక్షత్రం ఆర్ద్ర. ప్రతినెలా ఆర్ద్ర నక్షత్రం నాటి సాయంత్రం రోజున శ్రీ మలయప్పస్వామివారు 'సహస్ర దీపాలంకరణ



సేవ'లో పాల్గొంటారు. ఆరోజు భగవద్రామానుజులవారు మరో పీఠాన్ని ఎక్కి శ్రీస్వామివారికి అభిముఖంగా వుంటూ తిరుమల తిరువీథుల్లో ఊరేగింపబడతారు.

ప్రత్యేకంగా మేష మాసంలోని ఆర్ద్ర నక్షత్రానికి ముందు పదిరోజులనుంచి భాష్యకార్ల ఉత్సవాలు ఘనంగా జరుగుతవి. ఆ పదిరోజులు శ్రీస్వామివారికి అభిముఖంగానే రామానుజులవారు ఊరేగింపబడతారు. ఆలయంలో భాష్యకారుల సన్నిధిలో శ్రీస్వామివారికి ఆస్థానం జరుగుతుంది. నివేదనానంతరం శ్రీస్వామివారి మాలలు రామానుజులకు సమర్పిస్తారు. అలాగే శ్రీస్వామివారి శేషహారతి రామానుజులకు ఇవ్వబడుతుంది. ఈ దర్శనంతో 27 నక్షత్రాల వారికి నక్షత్రశాంతితోపాటు విశేషంగా 'ఆర్ద్ర' నక్షత్రశాంతి జరుగుతుంది.

### 3. పునర్వసు నక్షత్రోత్సవం

శ్రీరాముని జన్మనక్షత్రం పునర్వసు. ప్రతినెలా పునర్వసు రోజున సుప్రభాతానంతరం భోగ శ్రీనివాసమూర్తితోపాటు శ్రీ సీతారామ లక్ష్మణులకు అభిషేకం జరుగుతుంది. శ్రీరామనవమిరోజు, ఆ మరునాడు దశమిరోజు బంగారు వాకిలిముందు శ్రీ సీతారామలక్ష్మణులకు ఆస్థానం జరుగుతుంది.

ఆ సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవలో శ్రీ సీతారామ లక్ష్మణులు ఆజ్ఞాపాలక ఆంజనేయస్వామి మాత్రమే పాల్గొంటారు. అనంతరం తిరుమల పురవీథుల్లో ఊరేగింపు జరిగిన తర్వాత శ్రీ సీతారామలక్ష్మణులు శ్రీ బేడీ ఆంజనేయస్వామివారివద్దకు రాగా, అక్కడ రాములవారి పూలమాలను బేడీ ఆంజనేయస్వామికి సమర్పించిన తర్వాత శేషహారతికూడ ఇవ్వబడుతుంది.

పిదప శ్రీ సీతారామలక్ష్మణులు ఆలయంలో ప్రవేశిస్తారు. ఈ సేవ దర్శనంతో 27 నక్షత్రాలవారికి నక్షత్ర శాంతితోపాటు, "పునర్వసు" వారికి విశేషంగా నక్షత్రశాంతి జరుగుతుంది.

## 4. శ్రవణ నక్షత్రోత్సవం

శ్రీ వేంకటేశ్వరస్వామివారి అవతార నక్షత్రం శ్రవణం. శ్రవణంనాటి ఉదయం భోగ శ్రీనివాసమూర్తితోపాటు దేవేరులతో శ్రీ మలయప్పకు అభిషేకం జరుగుతుంది. అన్ని సేవలు అయిన తర్వాత ఆ సాయంత్రం శ్రీ మలయప్పస్వామి సహస్రదీపాలంకరణ సేవలో పాల్గొన్న పిదప పురవీథుల్లో ఊరేగింపబడి ఆలయం ప్రవేశిస్తారు.

తిరుమలలో శ్రవణ నక్షత్రానికి కొన్ని నెలల్లో విశేషంగా ఉత్సవాలు జరుగుతవి.

ప్రతి కన్యామాసంలోని శ్రవణం నాటికి ముగిసేట్లుగా బ్రహ్మోత్సవాలు జరుగుతవి. కార్తికమాసంలోని శ్రవణంనాడు శ్రీస్వామివారికి పుష్పయాగోత్సవం నిర్వహిస్తారు. శ్రవణం నక్షత్రం రోజున శ్రీస్వామివారి సహస్రదీపాలంకరణ సేవలో పాల్గొన్న తర్వాత పురవీథుల్లో ఊరేగింపబడతారు.

## 5. పున్నమి గరుడసేవ

కేవలం నక్షత్రోత్సవాలేగాక, ప్రతినెలా ప్రతి పున్నమినాటి రాత్రిపూట తిరుమలేశునికి "పున్నమి గరుడసేవ" నిర్వహింపబడుతున్నది. పున్నమినాటి రాత్రి 7.00 గం॥ల సమయంలో వజ్రకవచ వజ్రకిరీటాది సర్వాభరణ భూషితుడైన శ్రీ మలయప్ప స్వామివారు బంగారు గరుడునిపై వేంచేసి, ఛత్రచామరాలతో, గజతురగ వృషభరాజులతో తిరుమల పురవీథుల్లో విహరిస్తూ దర్శనమిస్తారు.

## సంవత్సరోత్సవాలు

సప్తగిరీశునకు సంవత్సరానికి ఒక్కమారు మాత్రమే ఆ యా విశేషదినాల్లో ఆ యా ఉత్సవాలు జరుగుతున్నాయి. సంవత్సరోత్సవాలుగా పిలువబడుతున్న వాటిని గూర్చి సంక్షిప్తంగా తెల్సుకుందాం.



## 1. కోయిల్ ఆళ్వారు తిరుమంజనం

కోయిల్ అనగా గుడి. ఆళ్వారు భగవంతునితో తాదాత్మ్యం పొందిన భక్తుడు. భక్తుడు భగవంతుణ్ణి తన హృదయంలో ప్రతిష్ఠించుకొన్నట్లే గుళ్లో దేవుణ్ణి ప్రతిష్ఠిస్తారు. అందుకే కోయిల్ ఆళ్వార్ అని గుడిని పిలవడం. తిరుమజ్జనమే తిరుమంజనం అయింది. తిరు = శ్రీ, మజ్జనం అనగా స్నానం – మంగళస్నానం. ఆలయం అంతా శుద్ధి చేయడం అన్నమాట. తిరుమల శ్రీవారి ఆలయానికి సంవత్సంలో నాలుగుమార్లు తిరుమంజనం జరుగుతుంది. ఉగాదికి ముందు, ఆణివార ఆస్థానానికి ముందు, బ్రహ్మోత్సవాలకు ముందు, వైకుంఠ ఏకాదశికి ముందు వచ్చే మంగళవారాల్లో శ్రీవారి ఆలయాన్ని శుభ్రంగా కడగడం అనే కోయిల్ ఆళ్వారు తిరుమంజనం జరుగుతుంది. ఇదొక మహాయజ్ఞంగా జరుగుతుంది.

గర్భాలయంలోని అన్ని ఉత్సవ విగ్రహాలు, బంగారు వెండిపాత్రలు బంగారు వాకిలి వరకు తెస్తారు. లోపల గోడలు పైకప్పులు ఇలా అంతటా కడిగి శుభ్రం చేస్తారు. ఇలా చుట్టు గుళ్లు కూడా శుభ్రం చేస్తారు.

పిదప 'పరిమళాన్ని' ఆలయంలో గోడలకు పూస్తారు. నామంకోపు, శ్రీచూర్ణం, గడ్డకర్పూరం, గంధంపొడి, కుంకుమ, ఖిచిలి గడ్డ – వీటి మిశ్రమమే 'పరిమళం' అంటారు. ఈ పరిమళపు లేహ్యాన్ని అంతటా పూస్తారు.

ఈ సేవ ఆర్జితంగా కూడ ప్రవేశపెట్టబడింది. ఈ సేవలో పాల్గొన్న గృహస్థులకు దివ్యక్షేత్రంలోని ఆలయాన్ని పరిశుభ్రం చేసిన పుణ్యం కలుగుతుంది.

## 2. ఉగాది ఆస్థానం

ప్రతి సంవత్సరం తెలుగు ఉగాదినాడు, తెలుగువారి ఇలువేలుపు అయిన శ్రీ వేంకటేశ్వరస్వామికి 'ఉగాది ఆస్థానం' జరుగుతుంది. ఆరోజు ఉదయం

మొదటి ఘంట నివేదనానంతరం శ్రీ మలయప్పస్వామి దేవేరులతో కూడా సర్వభూపాలవాహనంలో బంగారు వాకిలిముందు వేంచేస్తారు. శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనులవారు పక్కన దక్షిణాభిముఖంగా మరొక పీఠంపై వేంచేస్తారు.

విశేషంగా పట్టువస్త్ర సమర్పణ, ప్రసాద నివేదన అనంతరం, అక్షతారోపణ జరిగిన తర్వాత పంచాంగ శ్రవణం జరుగుతుంది. ఆనాటి తిథి వార నక్షత్రాలతోపాటు సంవత్సర ఫలాలు, దేశకాల వ్యవహారాది పంచాంగ వివరాలను శ్రీనివాసునికి విన్పించడం జరుగుతుంది.

చివరిగా కర్పూర నీరాజనాలు జరిగిన తర్వాత తీర్థప్రసాద వినియోగం జరుగుతుంది.

## 3. శ్రీరామనవమీ ఆస్థానం

ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ నవమిరోజున బంగారు వాకిలిముందు శ్రీరాములవారికి ఆస్థానం జరుగుతుంది. ఆ సాయంత్రం హనుమద్వాహనంపై ఊరేగింపు జరుగుతుంది. తరువాత బంగారువాకిలి వద్ద సర్వభూపాల వాహనంలో వేంచేయబడిన శ్రీ సీతారామలక్ష్మణులకు, హనుమంతునికి ఆస్థానం నివేదనలు, అక్షతారోపణ జరిగిన తర్వాత శ్రీ రామాయణంలోని శ్రీరామ జన్మవృత్తాంతం పురాణ ప్రవచనం జరుగుతుంది. పిదప మంగళ నీరాజనాలతో ఆస్థానం ముగుస్తుంది.

## 4. శ్రీరామ పట్టాభిషేకం

ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ దశమిరోజు సాయంత్రం తిరుమల పురవీథుల్లో శ్రీ సీతారామ లక్ష్మణులకు - అభిముఖంగా మరొక పీఠంపై ఆంజనేయుడు ఊరేగింపబడతాడు.



పిదప బంగారు వాకిలిముందర శ్రీ సీతారామ లక్ష్మణులకు వీరికి ప్రక్కన ఒక్కొక్క పీఠంపై సుగ్రీవ, అంగద, హనుమంతులను వేంచేపు చేసిన తర్వాత ఆస్థానం జరుగుతుంది. అక్షతారోపణ నివేదన కార్యక్రమాలు అయిన తర్వాత శ్రీరామజననం నుండి పట్టాభిషేకం వరకు కథను ప్రవచనం చేస్తారు. పిదప మంగళ నీరాజనము, పట్టాభిషేకం ఉత్సవం ముగుస్తుంది. తీర్థప్రసాద వినియోగం జరుగుతుంది.

## 5. వసంతోత్సవాలు

ప్రతి సంవత్సరం చైత్ర పూర్ణిమకు ముగిసేట్లుగా మూడురోజులపాటు తిరుమలలో వార్షిక వసంతోత్సవాలు జరుగుతవి.

చైత్రశుద్ధ త్రయోదశి రోజు ఉదయం శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్పస్వామి ఆలయానికి నైరృతి మూలలో వున్న వసంత మండపానికి వేంచేయగా వసంతోత్సవ అభిషేకాలు నివేదన ఆస్థానాలు జరుగుతవి. పిదప ఆలయాన్ని చేరుకొంటారు.

రెండవ రోజు శ్రీ మలయప్పస్వామికి బంగారు రథోత్సవం జరిగిన తర్వాత మళ్లీ ముందురోజు మాదిరే వసంతమండపంలో వసంతోత్సవం జరుగుతుంది.

మూడవరోజు శ్రీ మలయప్పస్వామితోపాటు, వేర్వేరు పల్లకీలలో రుక్మిణీ శ్రీకృష్ణులు, శ్రీ సీతారామలక్ష్మణులు కూడా వసంతమండపానికి ఊరేగింపుగా వెళ్ళి వసంతోత్సవ వేడుకల్లో పాల్గొని ఆ సాయంత్రం ఆలయానికి చేరుకొంటారు.

ఆర్జితంగా జరిగే ఈ వార్షిక వసంతోత్సవాల్లో భక్తులు పాలుపంచుకోవచ్చు. వసంతోత్సవం చేయించిన భక్తులకు తీవ్రమైన రోగాలు తగ్గి, ఆరోగ్యం సిద్ధిస్తుంది

## 6. పద్మావతీ పరిణయోత్సవాలు

వైశాఖ శుద్ధ దశమినాడు పద్మావతీ శ్రీనివాసుల పరిణయోత్సవ దినం. ఆ దినాన్ని పురస్కరించుకొని 1992 నుంచి మూడు రోజులపాటు 'పద్మావతీ పరిణయోత్సవాలు' తిరుమలలో జరుపబడుతున్నాయి.

ముందురోజు వైశాఖ శుద్ధ నవమిరోజు సాయంత్రం శ్రీ వేంకటేశ్వరస్వామి గజవాహనంపై, శ్రీదేవి భూదేవులు పల్లకిపై వేంచేసి, ఊరేగింపుగా నారాయణగిరి ఉద్యానవనం చేరుకోగా అక్కడ పరిణయోత్సవపు వేడుకలు ఘనంగా జరుగుతవి. సంగీతకచ్చేరీలు ఆస్థానం జరిగిన తర్వాత శ్రీ స్వామివారు దేవేరులతో కలిసి ఆలయం చేరుకొంటారు.

అలాగే రెండవరోజు వైశాఖ శుద్ధ దశమిరోజు అశ్వవాహనంపైన, మూడవరోజు వైశాఖ శుద్ధ ఏకాదశి గరుడవాహనంపైన వేంచేయగా, పల్లకిలో పై దేవేరులు వేంచేస్తారు. నారాయణగిరి ఉద్యానవనంలో పరిణయోత్సవపు వేడుకలు మొదటిరోజు మాదిరిగానే రెండవ, మూడవ రోజున కూడా పరిణయోత్సవపు వేడుకలు నిర్వహింపబడతవి. శ్రీ పద్మావతీ పరిణయోత్సవపు వేడుకలు దర్శించిన భక్తుల ఇండ్లలో వివాహాది శుభకార్యాలు సిద్ధిస్తవి. ఘనంగా జరుగుతవి.

ఆర్జిత రుసుమును చెల్లించిన భక్తులు ఈ సేవల్లో పాల్గొనవచ్చును.

## 7. జ్యేష్ఠాభిషేకం

ప్రతి సంవత్సరం జ్యేష్ఠమాసంలో జ్యేష్ఠానక్షత్రానికి ముగిసేట్లుగా మూడు రోజులపాటు తిరుమల శ్రీవారికి జ్యేష్ఠాభిషేకం సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణ మండపంలో జరుగుతుంది. దీన్నే "అభిధేయక అభిషేకం" అంటారు.



తరతరాలుగా అభిషేకాదులతో అత్యంత ప్రాచీనములైన శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షించే నిమిత్తం ఏర్పాటు చేసిన ఉత్సవమే ఇది. ఇది మూడురోజులపాటు నిర్వహించబడుతున్నది.

మొదటిరోజు శ్రీ మలయప్పకు వున్న బంగారు కవచాన్ని తీసివేసి, హోమాలు అభిషేకాలు పంచామృత స్నపనతిరుమంజనాదులు జరిగిన తర్వాత శ్రీస్వామివారికి వజ్రకవచం అలంకరించి పురవీథుల్లో ఊరేగిస్తారు.

యథాక్రమంగా రెండవరోజు ముత్యాల కవచ సమర్పణ చేసి ఊరేగిస్తారు. మూడవరోజు కూడ తిరుమంజనాదులు పూర్తిచేసి, బంగారు కవచాన్ని సమర్పించి ఊరేగింపు చేస్తారు. ఈ బంగారు కవచ సమర్పణ మళ్లీ జ్యేష్ఠాభిషేకంలోనే తీస్తారు. అంతవరకు సంవత్సరం పొడవునా శ్రీవారు బంగారు కవచంతోనే వుంటారు.

ఆర్జిత సేవగా నిర్వహింపబడుతున్న ఈ ఉత్సవంలో భక్తులు పాల్గొనవచ్చు. ఈ సేవలో పాల్గొన్న భక్తులను కవచంలాగా స్వామి రక్షిస్తాడు.

## 8. ఆణివార ఆస్థానం

ప్రతి సంవత్సరం దక్షిణాయన పుణ్యకాలం, కర్కాటక సంక్రాంతి నాడు తిరుమలలో "ఆణివార ఆస్థానం" అనే ఉత్సవం జరుగుతుంది. తమిళుల ఆణిమాసం చివరిరోజున జరిగే ఆస్థానం కనుక దీన్ని "ఆణివార ఆస్థానం" అంటారు. ప్రతి సంవత్సరం జూలై 16న ఈ ఆస్థానం జరుగుతుంది.

పూర్వం దేవస్థానం వారి ఆదాయవ్యయాలు, నిలువలు, మున్నగు సంవత్సర లెక్కలు ఈ ఆణివార ఆస్థానం రోజున ప్రారంభమయ్యేవి. ప్రస్తుతం వర్తమాన లెక్కల ప్రకారం "బడ్జెట్" ఏప్రిల్‌కు మార్పు చేయబడింది. అయినా ఆ ఉత్సవం అలాగే కొనసాగుతూ ఉంది.

ఆ రోజు బంగారు వాకిలిముందు సర్వభూపాల వాహనంలో శ్రీదేవి, భూదేవులతో శ్రీ మలయప్పస్వామివారిని వేంచేపు చేస్తారు. మరొక పల్లకిపై విష్వక్సేనులవారిని వేంచేపు చేసిన పిదప ఘనంగా వస్త్రసమర్పణ, నివేదనలు జరుగుతాయి. పిదప అక్షతారోపణ జరిగిన తర్వాత కార్యనిర్వహణాధికారికి దేవస్థానం బీగాల గుత్తిని తగిలించి ఆరతి, శఠారులను ఇస్తారు. ఆ తర్వాత ప్రసాద వితరణ జరుగుతుంది.

బంగారు వాకిలి ముందు జరిగే ఆణివార ఆస్థానంలో అర్చకులు, జియ్యంగార్లు అధికారులు దేవస్థానం ఉద్యోగులు మాత్రమే పాల్గొంటారు.

## 9. పుష్పపల్లకి

జూలై 16న ఆణివార ఆస్థానం సందర్భంగా ఆ సాయంత్రం తిరుమల పురవీథుల్లో దేవేరులతో కూడిన శ్రీ మలయప్పస్వామికి పుష్పపల్లకిలో ఊరేగింపు జరుగుతుంది. వివిధ పుష్పమాలలతో చక్కగా అలంకరింపబడిన పుష్పరథంలాంటి పల్లకిలో శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్పస్వామివారి తిరువీథ్యుత్సవం చూచితీరవలసిందే కాని వర్ణించడానికి సాధ్యం కాదు. ఆర్జిత రుసుమును చెల్లించిన భక్తులు ఈ పుష్పపల్లకి ఉత్సవంలో పాల్గొనవచ్చును. ఈ సేవను చేయించినా, లేదా పుష్పపల్లకిని దర్శించినా పూర్వజన్మ వాసనలన్నీ నశించి, శాంతి ఏర్పడుతుంది.

## 10. పవిత్రోత్సవాలు

వైదిక సంప్రదాయం ప్రకారం జాతాశౌచం, మృతాశౌచం వంటి వేళల్లో ఆలయ ప్రవేశం నిషిద్ధం. అయినా యాత్రీకులవల్ల సిబ్బందివల్ల తెలిసీ, తెలియక ఇలాంటి దోషాలు జరుగుతుంటాయి. ఇలాంటి వాటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు తెలిసీ, తెలియక జరిగే దోషాల పరిహరణార్థం జరిగే పవిత్ర కార్యక్రమమే "పవిత్రోత్సవం". ఈ



పవిత్రోత్సవాలు కేవలం ఆలయశుద్ధి, పుణ్యాహవాచనం లాంటి కార్యక్రమాలు మాత్రం కావు. సంప్రోక్షణ కంటె భిన్నమయిన క్రియాకలాపంతో కూడినదే ఈ పవిత్రోత్సవం.

పవిత్రోత్సవాలు తిరుమలలో 15-16 శతాబ్దాల వరకు జరుగుతున్నట్లు దాఖలాలున్నాయి. అర్ధాంతరంగా నిలిచిపోయిన ఈ ఉత్సవాలు 1962 నుంచి దేవస్థానం ఉద్ధరించి నిర్వహిస్తున్నది. ఇది మూడురోజుల కార్యక్రమం.

ప్రతి సంవత్సరం శ్రావణ శుద్ధ దశమి ఏకాదశి ద్వాదశి రోజుల్లో కల్యాణ మండపంలో జరుగుతున్నది.

మొదటిరోజు పవిత్రాల ప్రతిష్ఠ, హోమాలు, దేవేరులతో శ్రీమలయప్ప స్వామికి అభిషేకాలు జరుగుతాయి. రెండవరోజు ఆలయాలలో ఆలయ పరిసరాలలోను వున్న మూర్తులకు పవిత్రాల సమర్పణ జరుగుతుంది. మూడవరోజు పూర్ణాహుతి. మూడురోజులూ సాయంత్రంపూజ తర్వాత శ్రీ మలయప్పస్వామి ఊరేగింపబడుతారు.

ఆర్జిత రుసుమును చెల్లించి భక్తులు ఈ సేవలో పాల్గొనవచ్చు. ఈ సేవల్లో పాల్గొన్న భక్తులకు వారి వంశంలో ఎవరైనాసరే, తెలిసికాని, తెలియకకాని చేసిన దేవతాపరాధాలు తొలగిపోతాయి. తద్వారా సుఖశాంతులు కలుగుతాయి.

## 11. శ్రీకృష్ణాష్టమి

శ్రీకృష్ణాష్టమి రోజు రాత్రి తోమాలసేవ అనంతరం బంగారు వాకిలి వద్ద శ్రీకృష్ణస్వామికి తిరుమంజనం జరుగుతుంది. అదే సమయంలో మరొక పీఠంపై శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్రశ్రీనివాసమూర్తిని వేంచేపు చేసి ద్వాదశ తిరువారాధన చేస్తారు. ఈ అభిషేకాలు ఏకాంతంగా నిర్వహించబడుతవి. పిదప ఉగ్రశ్రీనివాసమూర్తిని ఆనందనిలయంలోనికి వేంచేపు చెయ్యగా శ్రీకృష్ణస్వామికి

ఆస్థానం జరుగుతుంది. శయనించిన బాలకృష్ణుని రూపంలోవున్న స్వామికి నివేదనలు జరిగిన తర్వాత అక్షతారోపణం జరుగుతుంది.

పిదప శ్రీమద్భాగవతంలోని శ్రీకృష్ణావతార ఘట్టం పురాణపఠనం జరుగుతుంది. హారతితో ఆస్థానం పూర్తి అవుతుంది.

మరునాడు తెల్లవారుఝామున బాలకృష్ణుని ఊరేగిస్తూ బాలకృష్ణునికి తైలకాపు చేసిన నూనెను భక్తులకు పంచుతారు. భక్తులు ఆ నూనెను తలలకు అంటుకొని మంగళస్నానాలు చేస్తారు.

పిదప ఆ మధ్యాహ్నం శ్రీమలయప్ప స్వామితోపాటు మరొక పల్లకిపై వెన్నముద్ద కృష్ణుడు తిరుమల వీథుల్లో ఊరేగుతుండగా ఉట్ల ఉత్సవం జరుగుతుంది. ఉట్లు కొట్టడమనే వేడుక తిరుమలలో ఘనంగా అడుగడుగునా జరుగుతుంది. శ్రీవారు ఆలయంలో ప్రవేశించడంతో కృష్ణాష్టమి వేడుకలు ముగుస్తాయి.

## 12. బ్రహ్మోత్సవాలు

ఏడుకొండల స్వామికి ఏడాది పొడవునా ఎన్నో ఉత్సవాలు జరిగినా ఏడాదికి ఒకమారు తొమ్మిదినాళ్లపాటు జరిగే బ్రహ్మోత్సవాలు తిరుమల చరిత్రలోనే అత్యంత ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి.

బ్రహ్మాది దేవతల కోరికపై కలియుగ మానవుల రక్షణకై 'కలౌ వేంకటనాయకః' అన్న బిరుదుతో శ్రీవేంకటేశ్వరుడనే పేరుతో స్వయంవ్యక్త మూర్తిగా కన్యామాసం శ్రవణ నక్షత్రం రోజున ఆవిర్భవించినాడు. ఆ రోజును పురస్కరించుకొని బ్రహ్మదేవుడు ఆ రోజుకు పూర్తి అగునట్లు తొమ్మిది నాళ్లపాటు శ్రీనివాసునికి ఉత్సవాలు నిర్వహించినాడు. బ్రహ్మదేవుడు నిర్వహించినందువల్ల బ్రహ్మోత్సవాలని సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీవేంకటేశ్వరునకు జరిగినందువల్ల బ్రహ్మోత్సవాలని ప్రసిద్ధి ఏర్పడింది.



బ్రహ్మదేవుడు ప్రారంభించిన ఈ ఉత్సవాలేకాక కాలక్రమేణ ఎందరో రాజులు కూడా తిరుమలేశునకు బ్రహ్మోత్సవాలు నిర్వహించారు.

క్రీ.శ.614 పల్లవరాణి సామవై, భోగశ్రీనివాసమూర్తిని బహూకరించి, కన్యామాసంలో జరిగే బ్రహ్మోత్సవాలకు ముందు ఈ మూర్తిని ఊరేగించాలని ఏర్పాటు చేసిందట.

క్రీ.శ.1254 చైత్రమాసంలో తెలుగు పల్లవరాజు విజయగండ గోపాలదేవుడు, క్రీ.శ. 1328 ఆషాఢమాసంలో 'ఆడి తిరునాళ్ల' పేర త్రిభువన చక్రవర్తి తిరువేంకటనాథ యాదవరాయలు, క్రీ.శ.1429 ఆశ్వయుజ మాసంలో వీరప్రతాప దేవరాయలు, క్రీ.శ.1446లో 'మాసితిరునాళ్ల' పేర హరిహరిరాయలు, క్రీ.శ.1530లో 'అచ్యుతరాయ బ్రహ్మోత్సవం' పేర అచ్యుతరాయలు అని ఇలా 1583 నాటికి బ్రహ్మోత్సవాలు సంవత్సరంలో ఇంచుమించు నెలకొకటి వంతున జరిగేవట!

కాలాంతరంలో ఆ రాజులూ, ఆ రాజ్యాల లాగే, వారు ఏర్పాటుచేసిన ఉత్సవాలు నిలిచిపోయాయి. కాని బ్రహ్మదేవుడు ఏర్పాటుచేసిన ఉత్సవం మాత్రం నేటికీ కొనసాగుతూ ఘనంగా నిర్వహింపబడుతూ ఉంది. ఇది తొమ్మిదినాళ్లపాటు జరుగుతుంది.

ముందురోజు సాయంత్రం అంకురార్పణ, శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనులవారి ఆధ్వర్యంలో మృత్సంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమం జరుగుతుంది. ఆ మరునాడు ధ్వజారోహణనాడు బంగారుధ్వజస్తంభంపై గరుడకేతనాన్ని ఎగురవేస్తూ సర్వలోకవాసులు ఆహ్వానింపబడతారు. ఆ రాత్రి శ్రీస్వామివారికి పెద్దశేషవాహనం జరుగుతుంది. ఈ ధ్వజారోహణ రోజున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

ఇక ఆ మరునాడు ఉదయం సాయంత్రం రెండువేళలా రెండవరోజు చిన్నశేషవాహనం, హంసవాహనం మూడవరోజు సింహవాహనం ముత్యపుపందిరి, నాల్గవరోజు కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, ఐదవరోజు ఉదయం దంతపు పల్లకిలో మోహినీ అవతారం, ఆ రాత్రి గరుడోత్సవం జరుగుతుంది. శ్రీవిల్లి పుత్తూరు నుంచి గోదాదేవి ధరించిన పూలమాల, మద్రాసు నుంచి కొత్త గొడుగులు వస్తాయి. వీటినన్నింటిని ధరించిన మలయప్పస్వామి బంగారు గరుడునిపై ఊరేగింపబడుతాడు. లక్షలాది మంది భక్తులు గరుడోత్సవాన్ని తిలకిస్తారు.

ఇక ఆరవరోజు హనుమద్వాహనం, గజవాహనం, ఏడవరోజు సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, ఎనిమిదో రోజు రథోత్సవం, అశ్వవాహనం జరుగుతాయి. తొమ్మిదో రోజు చక్రస్నానం. ఆ రాత్రి ధ్వజారోహణం కార్యక్రమాలు ఘనంగా నిర్వహింపబడుతాయి.

అధికమాసం వచ్చిన ఏడాది తిరుమలేశునకు రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహింపబడుతాయి. ఒకటి కన్యామాసంలో వార్షిక బ్రహ్మోత్సవంగాను, మరొకటి శరన్నవరాత్రులలో నవరాత్రి బ్రహ్మోత్సవంగాను నిర్వహింపబడుతాయి.

## 13. దీపావళి ఆస్థానం

దీపావళి పండుగనాడు బంగారు వాకిలిముందు శ్రీ మలయప్పస్వామి వారికి ఆస్థానం జరుగుతుంది.

ఆలయంలో యథాక్రమంగా మొదటిఘంట నివేదన పూర్తి అయిన తర్వాత బంగారు వాకిలి ముందు సర్వభూపాలవాహనంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామివారిని వేంచేపు చేస్తారు. మరొక పీఠంపై విష్వక్సేనులవారిని వేంచేపు చేసిన తర్వాత ఘనంగా నూతనవస్త్ర సమర్పణ, నివేదనలు జరిగిన తర్వాత అక్షతారోపణ చేస్తారు. చివరగా ఘనంగా హారతులు సమర్పించిన తర్వాత తీర్థచందన, శఠారి వితరణతో దీపావళి ఆస్థానం ముగుస్తుంది.



## 14. పుష్పయాగం

ప్రతి సంవత్సరం బ్రహోత్సవాల అనంతరం కార్తికమాసంలో శ్రవణ నక్షత్రం రోజున శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్ప స్వామివారికి “పుష్పయాగం” జరుగుతుంది. క్రీ.శ. 15వ శతాబ్దం నాటికే తిరుమలలో జరుగుతూ, అర్థాంతరంగా నిలిచిపోయిన ఈ పుష్పయాగాన్ని క్రీ.శ. 1980 నవంబరు 14 నుంచి తి.తి.దేవస్థానం పునరుద్ధరించి నిర్వహిస్తున్నది.

పుష్పయాగం జరిగే రోజు యథాక్రమంగా రెండు అర్చనలు రెండు నివేదనలు పూర్తి అయిన తర్వాత శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్ప స్వామి కల్యాణమండపానికి వేంచేస్తారు. హోమాలు, స్నపన తిరుమంజనాదులు నిర్వహిస్తారు. పిదప ఆ మధ్యాహ్నం శ్రీస్వామివారికి వివిధ రకాలయిన పుష్పాలతో పుష్పార్చన జరుగుతుంది. ఈ పుష్పాలు శ్రీవారి హృదయం వరకు రాగానే వీటిని తొలగిస్తారు. మళ్లీ పుష్పార్చన జరుగుతుంది. ఇలా 20 మార్లు జరుగుతుంది. పిదప ఘనంగా హారతి సమర్పిస్తారు.

ఆర్జిత రుసుమును చెల్లించిన భక్తులు కూడ ఈ పుష్పయాగంలో పాల్గొనవచ్చు. పుష్పయాగంలో పాల్గొన్న భక్తులకు పూర్వజన్మల వాసనలు తొలగడమేగాక, సర్వరోగాలు నశిస్తాయి. తద్వారా సుఖశాంతులతో ప్రశాంతంగా జీవనం సాగుతుంది.

## 15. ధనుర్మాసం - తిరుప్పావై

తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారికి ఏడాది పొడవునా తెల్లవారు జామున “సుప్రభాతసేవ” జరుగుతుంది. కాని ధనుర్మాసంలో ఒక్క నెలపాటు మాత్రం సుప్రభాతానికి బదులుగా “తిరుప్పావై” పఠన జరుగుతుంది.

గోదాదేవి తాను ద్వాపరయుగం నాటి గోపికగా భావించి పాడిన 30 పాశురాలను రోజుకొకటి వంతున గానం చేస్తూ విన్పిస్తారు. ఈ సందర్భంలో

భోగశ్రీనివాసమూర్తికికాక వెన్నముద్ద కృష్ణునికి ఏకాంతసేవ జరుగుతుంది. ఈ తిరుప్పావై పఠన పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది.

ఈ ధనుర్మాసంలో శ్రీవేంకటేశ్వరస్వామి వారి సహస్రనామార్చనలో తులసికి బదులుగా "బిల్వదళాల్ని" ఉపయోగిస్తారు.

## 16. వైకుంఠ ఏకాదశి

ధనుర్మాసంలో శుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశి అంటారు. వైకుంఠ ఏకాదశి తెల్లవారు జామున తిరుమల వైకుంఠ ద్వారం తెరవబడి, తిరిగి వైకుంఠ ద్వాదశి తెల్లవారుజామున మూసివేయబడుతుంది. వైకుంఠ ఏకాదశి రోజున శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీమలయప్పస్వామి సర్వాభరణ భూషితుడై తిరుమల తిరువీధులలో స్వర్ణరథంలో ఊరేగింపబడిన తర్వాత ఆలయంలో ఆస్థానం జరుగుతుంది.

## 17. గోదాపరిణయోత్సవం

ధనుర్మాసంలో చివరిరోజున కనుమ పండుగనాడు శ్రీస్వామివారి వక్షఃస్థల లక్ష్మిని గోదాదేవిగా భావించి గోదాపరిణయోత్సవం నిర్వహిస్తారు. ఆ రోజు తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలోని (ఆండాళ్) గోదాదేవి ధరించిన పూలమాలను తిరుమలకు తీసికొని వచ్చి శ్రీ స్వామివారికి ధరింపజేస్తారు.

## 18. పారువేట ఉత్సవం

ప్రతి సంవత్సరం కనుమ పండుగరోజు తిరుమలలో పారువేట ఉత్సవం జరుగుతుంది. ఆ రోజు, ఆలయంలో రెండవ నైవేద్యం ముగిసిన తర్వాత శ్రీస్వామివారు పంచాయుధాలను ధరించి, వేటకు బయలుదేరుతారు. మరొక పల్లకిపై శ్రీకృష్ణస్వామి వేంచేస్తారు.

శ్రీవారి ఆలయానికి వాయవ్యమూలలో ఒక మైలు దూరంలో వున్న పారువేట మండపానికి వేంచేసి సాయంత్రం వరకు అక్కడనే వుండి



శ్రీస్వామివారు వేట కార్యక్రమంలో పాల్గొంటారు. పారువేటలో తాళ్లపాకవారి సేవలందుకొంటాడు. శ్రీకృష్ణస్వామి ఆ పక్కనేవున్న గొల్లల విడిదికి వెళ్లి వారి అర్చనలందుకొంటాడు.

సంగీత ధార్మిక కార్యక్రమాలతో ఘనంగా జరిగే పారువేట ఉత్సవంలో వేలాదిమంది పాల్గొంటారు. ఆ సాయంత్రం మళ్లీ యథాక్రమంగా శ్రీవారు ఆలయానికి వేంచేస్తారు.

ప్రతి మూడవ ఏట జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవానంతరం కూడ ఇలాగే "పారువేట ఉత్సవం" జరుగుతుంది. పారువేటలో శ్రీవారిని దర్శించిన వారికి ఇంద్రియనిగ్రహం కలుగుతుంది.

## 19. రథసప్తమి

ప్రతి సంవత్సరం మాఘ శుద్ధసప్తమి "సూర్యజయంతి" నాడు తిరుమలలో రథసప్తమి పేరుతో ఉత్సవం జరుగుతుంది.

ఆ రోజు శ్రీస్వామివారు సూర్యోదయం మొదలుగా సూర్యాస్తమయం వరకు ఏడు వాహనాల్లో విహరిస్తాడు.

సూర్యప్రభ వాహనం, చిన్న శేషవాహనం, గరుడవాహనం, హనుమద్వాహనం, కల్పవృక్షవాహనం, సర్వభూపాల వాహనం, చంద్రప్రభ వాహనం ఇలా ఏడు వాహనాల్లో శ్రీ మలయప్పస్వామి దర్శనమిస్తాడు. మధ్యాహ్నం చక్రస్నానం కూడా జరుగుతుంది. రథసప్తమి వేడుకలను అర్ధ బ్రహ్మోత్సవమని, ఒకనాటి బ్రహ్మోత్సవమనీ అంటారు.

## 20. తెప్పోత్సవాలు

ప్రతి ఏటా శ్రీస్వామి పుష్కరిణిలో ఫాల్గుణ పూర్ణిమకు పూర్తి అగునట్లుగా ఐదురోజులపాటు తెప్పోత్సవాలు జరుగుతాయి.

క్రీ.శ. 1468 నాటికే తెప్పోత్సవాలు జరుగుతున్నట్లు తెలుస్తున్నది. తాళ్లపాక అన్నమయ్య కూడ తెప్పోత్సవాలను ఘనంగా వర్ణించాడు. కాలాంతరంలో నిలిచిపోయిన ఈ తెప్పోత్సవాలు 1921లో పునరుద్ధరింపబడినాయి.

ప్రస్తుతం ఐదురోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో మొదటిరోజు ఫాల్గుణశుద్ధ ఏకాదశిన శ్రీ సీతారామ లక్ష్మణులు, రెండవరోజు ద్వాదశిన రుక్మిణీ శ్రీకృష్ణులు పాల్గొంటారు. ఇక మూడవరోజు త్రయోదశి నుండి పున్నమి వరకు మూడురోజులపాటు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్ప స్వామి తెప్పోత్సవంలో పాల్గొంటాడు.

ఈ తెప్పోత్సవంలో ఆర్జిత రుసుమును చెల్లించిన భక్తులు కూడ పాల్గొనవచ్చు.

## 21. ప్రణయ కలహోత్సవం

ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశికి సరిగ్గా ఆరవరోజు తిరుమలలో ప్రణయ కలహోత్సవం జరుగుతుంది.

ఆ రోజు యథాప్రకారం రెండవ గంట నివేదన అయిన తర్వాత శ్రీమలయప్పస్వామి పల్లకి ఎక్కి మహాప్రదక్షిణ మార్గంలో స్వామి పుష్కరిణి దగ్గరకురాగా ఇంతలో అమ్మవారలు చెరొక పల్లకిపై అప్రదక్షిణంగా స్వామివారికి ఎదురుగా వచ్చి నిలుచుంటారు. అంత పురాణపఠనం జరుగుతుండగా అమ్మవారల తరపున జియ్యంగారు పూలచెండులతో వేటకు వెళ్లివచ్చిన స్వామివారిని మూడు మారులు తాడించగా, స్వామివారు బెదిరినట్లుగా నటించి తానేమి తప్పు చేయలేదని అమ్మవారలను ప్రాధేయపడతాడు. పిదప అమ్మవారలు శాంతించి స్వామివారికి ఇరువైపుల చేరి స్వామితోపాటు కర్పూర హారతులందుకొని ఆలయం చేరుకోగా, ఆస్థానం జరుగుతుంది.



## 22. అధ్యయనోత్సవాలు

వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందుగా ప్రారంభమై 25 రోజులపాటు జరిగే అధ్యయనోత్సవాల్లో విశేషంగా దివ్యప్రబంధ పారాయణ జరుగుతుంది. చివరిరోజు "తణ్ణీరముదు ఉత్సవం" అనే పేరుతో "తిరుమలనంబి"ని తాతా! తాతా! అని పిలుస్తూ బోయవాని రూపంలో శ్రీనివాసుడు నీళ్లు తాగిన రోజుకు గుర్తుగా ఉత్సవం జరుపబడుతుంది. పై ఉత్సవాన్నే గాక, తిరుమల శ్రీవారి అనేక ఉత్సవాల్లో దివ్యప్రబంధ పారాయణ సంప్రదాయాన్ని భగవద్రామానుజులవారు ఏర్పరిచారు.

ఇంతమాత్రమేగాక నరసింహజయంతి, శ్రీ వరాహజయంతి, అనంత పద్మనాభ చతుర్దశి, చక్రతీర్థముక్కోటి, కైశికద్వాదశి, కార్తిక దీపోత్సవం, క్షేత్రపాలక ఉత్సవం, తిరువాడిపూరం ఉత్సవం, శ్రీవారి బాగ్‌సవారి ఉత్సవం– పురిశైతోట ఉత్సవం వంటి వార్షికోత్సవాలు కూడ తిరుమల శ్రీవారి ఆలయంలో నిర్వహింపబడతాయి.

సృష్టికర్త బ్రహ్మదేవుడు మొదలుకొని సామాన్య మానవులదాకా శ్రీవేంకటేశ్వర స్వామివారికి ఉత్సవాలు, ఊరేగింపులు, అర్చనలు, ఆరాధనలు, సేవలు... ఇలా తమ తమ ఇష్టానుసారం తృప్తిగా నిర్వహిస్తారు. ఆనందంగా మొక్కులు సమర్పించుకొంటారు. కనుకనే తిరుమల క్షేత్రంలో ఎప్పుడూ ఏదో ఒక వేడుక కొనసాగుతునే ఉంటుంది. అందువల్లే సర్వదేవతలకు, సిద్ధపురుషులకు పరమయోగులకు, సాధకులకు ఆలవాలమై నిరంతరం నిరంతరాయంగా భక్తజన సందోహంతో కిటకిటలాడుతూ ఈ క్షేత్రం "నిత్యకల్యాణం పచ్చతోరణం" గా భాసిస్తూ వుంటుంది.

సంవత్సరం పొడవునా సప్తగిరీశునకు సుమారు 400లకు పైగా సేవలు ఉత్సవాలు, చిన్నవీ, పెద్దవీ, అందరు దర్శించతగినవీ, అందరూ చూడలేనివీ...

ఇలా ఎన్నో ఎన్నెన్నో జరుగుతున్నాయి. తిరుమలక్షేత్రంలో ప్రతిరోజూ పండుగనే! ప్రతిపూటా పరమాన్నాలే! పాయసాలే! కమ్మని పిండివంటలే!

ఆనందనిలయుడు ఉత్సవ ప్రియుడట! అంతకంటె భక్తప్రియుడట! ఆ స్వామివారికున్న భక్తవాత్సల్యం, భక్తప్రియత్వం అంతా ఇంతా అని చెప్పడానికి సాధ్యం కాదట! తనను చేరవచ్చిన భక్తులచేత ఉత్సవాలు చేయించుకొంటాడు. మొక్కులు చెల్లింప చేసుకొంటాడు. ఊరేగింపులు చేయించుకొంటాడు! తనకు ఉత్సవాలు, ఊరేగింపులు నిర్వహించిన భక్తులకు ఎనలేని కల్యాణ పరంపరలు, శుభపరంపరలు కలిగిస్తాడు. ఉత్సవాలు చేయించలేకపోయినా పర్వాలేదట! ఆ కొండలరాయని కొండంత వైభవాన్ని, అంగరంగంగా కొనసాగే మహోత్సవాలను కన్నులారా తిలకిస్తే చాలట! పాపాలు పోతాయి. కోరికలన్నీ సిద్ధిస్తాయి!! ఆనందనిలయుని మనసారా దర్శిస్తే చాలు చాలు. అంతులేని బ్రహ్మానందం కలుగుతుంది.

అంతకంటే ఈ మానవజన్మకు ఇంకేం కావాలి? అందువల్ల "ఉత్సవాల దేవుడు వేంకటేశ్వరుడు" అని ప్రసిద్ధి పొందిన ఏడుకొండలవాడికి ఉత్సవాలను చేసినా చాలు! వాటిని చూసినా చాలు చాలు!! కనీసం వాటిని స్మరించినా అంతకంటె చాలు! వారి జన్మము ధన్యము! వారి వంశము ధన్యాతి ధన్యము!!

## సమర్పణం

"చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమూ! రోగాలడచీ రక్షించే దివ్యౌషధము! బడిబాయక వెంటతిరిగే ప్రాణబంధువు" నకు మీదు మిక్కిలి తెలుగువారి "ఇలవేలుపు" "ఇలువేలుపు" అయిన ఘనవేంకట ప్రభువు దివ్యపాద పద్మములకు ఈ చిన్న పుస్తక సుమాన్ని సమర్పణం చేసుకొని తరింతము గాక!!

ఇందులోని నాయకోత్తముడు ఆ కొండలరాయడు! ఇందులోని విషయాలన్నీ ఆ ఘన వేంకటేశునివి! ఇందులోని సర్వమూ సప్తగిరీశునిదే!



ఇంక ఈ "బాలుడు" (రచయిత) కూడ బాలాజీ కొలువులోని వాడే! ఇలా అంతా ఆ స్వామిదే అయినప్పుడు, ఆ స్వామికి చెందిన వస్తువును ఆ స్వామివారికే అప్పజెప్పడంలో గొప్పేముంది గనక!!

**కేశవ దాసినైతి గెలిచితి వన్నిటాను**
**యీ శరీరపు నేరాలిక నేల వెదక? ॥పల్లవి॥**

**నిచ్చలు కోరికలియ్య నీ నామమే చాలు**
**తెచ్చి పునీతు చేయ నీ తీర్థమే చాలు**
**పచ్చి పాపా లణచ నీ ప్రసాదమే చాలు**
**యెచ్చుకొందు వుపాయాలు ఇక నేల ॥కేశవ॥**

**ఘనుని చేయగను నీ కైంకర్యమే చాలు**
**మొనసి రక్షించను నీ మంత్రమే చాలు**
**మనిపి కావగ తిరుమణి లాంఛనమే చాలు**
**యెనసెను దిక్కుదెస ఇక నేల వెదక ॥కేశవ॥**

**నెలవైన సుఖమియ్య నీ ధ్యానమే చాలు**
**అల దాపుదండకు నీ యర్చనే చాలు**
**యిలపై శ్రీ వేంకటేశ! యిన్నిటా మాకు కలవు**
**యెలమి నితరములు యిక నేల వెదక ॥కేశవ॥**

**ఓం నమో వేంకటేశాయ**

* * *